Truth of News
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.com
IRS PUBLICATIONS
e-mail: irspublications123@gmail.com
https://epaper.suryavastavam.com
శుక్రవారం | 14 జూన్ 2024 | తిరుపతి
సంపుటి 1 | సంచిక 10
పేజీలు 8+8 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Tirupati, Guntur, Nellore, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi


ముఖ్యమంత్రి గా భాధ్యతలు స్వీకరణ

## ఎపిని నంబర్‌వన్‌గా తీర్చి దిద్దుతా

### తిరుమల నుంచి పాలనా ప్రక్షాళన


శ్రీవారిని కుటుంబసమేతంగా దర్శించుకున్న సిఎం చంద్రబాబు



తిరుమల జూన్ 13 (సూర్య వాస్తవం) : టిటిడి నుంచే పాలనా ప్రక్షాళన చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శ్రీవారి సమక్షం లో చెబుతున్నా.. నేను 5కోట్ల ప్రజల మనిషిని. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ 5 ఏళ్ళు ఎంతో ఇబ్బంది పడ్డారు. రాష్ట్రంలో ఉద్యోగులతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడ్డారని అన్నారు. రాష్ట్రంలో ఇకపై పరదాలు, నియంత్రణ వుండదు. నేటి నుంచి ప్రజా పాలన ప్రారంభం అయ్యింది. గత 5ఏళ్లలో జరిగిన నష్టం అపారం. రాష్ట్రం 30 సంవత్సరాలు వెనక్కి వెళ్ళింది. 2047 నాటి భారత్ ప్రపంచంలోనే మొదటి రెండు స్థానాల్లోకి వస్తుంది. 2047 విజన్‌తో ముందుకు వెళ్తానిని ప్రకటించారు. ఏపీ దేశంలోనే నెంబర్ 1న రాష్ట్రంగా ఉండాలి. తెలంగాణ అభివృద్ధి చెందాలి. తెలుగు రాష్ట్రాల కు పెద్దగా రెంటికీ మంచి జరిగేలా చూస్తానని అన్నారు. గురువారం ఉదయం చంద్రబాబు కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీ వెంకటేశుని దర్శనం 2లో

## సీఎం చంద్రబాబుకు రాజధాని రైతుల ఘన స్వాగతం



అమరావతీ, సూర్య వాస్తవం: ఎపి ముఖ్యమంత్రిగా నిన్న ప్రమాణ స్వీకారం చేసిన నారా చంద్రబాబు నాయుడు అమరావతిలోని సచివాలయం మొదటి బ్లాక్ లో సాయంత్రం 4.41 గంటలకు బాధ్యతలు చేపట్టారు. ముఖ్యమంత్రి హోదాలో 5 ఏళ్ల తరువాత సచివాలయానికి వచ్చిన చంద్రబాబు నాయుడు కి రాజధాని రైతులు అత్యంత ఘనమైన స్వాగతం పలికారు. వేల మంది రోడ్ల మీదకు వచ్చి....రాహదారులు అన్నీ పూలమయం చేసి, ముఖ్యమంత్రి పై అభిమానం చాటారు. అలాగే సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు, అధికారులు సిఎంకు స్వాగతం పలికారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ సహా మంత్రులు, ఆలిండియా సర్వీసెస్ అధికారులు ముఖ్యమంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.





## బాధ్యతలు స్వీకరించిన సిఎం చంద్రబాబు

### మెగా డిఎస్సీ...ల్యాండ్ టైటిలింగ్‌పై మలి సంతకం



అమరావతి,జూన్ 13 (సూర్య వాస్తవం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాయంత్రం 4.41 గంటలకు సచివాలయం మొదటిబ్లాక్‌లోని తన ఛాంబర్‌లో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేసి బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం హోదాలో సచివాలయానికి వచ్చిన చంద్రబాబుకు వివిధశాఖల ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల నేతలు ఘన స్వాగతం పలికారు.ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు.. 16,347 టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి మెగా డీఎస్సీ దస్త్రంపై సీఎం మొదటి సంతకం చేశారు. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు పై రెండో సంతకం, సామాజిక పింఛన్లు రూ.4వేలకు పెంపు దస్త్రంపై మూడో సంతకం, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణపై నాలుగు, నైపుణ్య గణనపై ఐదో సంతకం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు సిఎం చంద్రబాబుకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు సచివాలయానికి వెళ్తున్న సీఎం చంద్రబాబుకు అమరావతి రైతులు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. దారి పొడవునా పూలు చల్లి మహిళలు హారతులు పట్టారు. సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభంలో భారీ పూలదండలతో ఆయనకు స్వాగతం పలికారు. వారిని చూసిన చంద్రబాబు తన కాన్వాయ్ నుంచి దిగి రైతులకు అభివాదం చేశారు. వారితో ఆప్యాయంగా మాట్లాడారు. సీఎం చంద్రబాబు ప్రయాణించే రోడ్డుమార్గం మొత్తం అమరావతి రైతులు పూలతో నింపేశారు. సీడ్ యాక్సెస్, మందడం, వెలగపూడి రోడ్ల మీదుగా సచివాలయం వరకు రకరకాల పూలతో రహదారులు నిండిపోయాయి. ఐదేళ్ల తర్వాత అమరావతి అభివృద్ధికి అడుగులు పడనుండడంతో చిన్న, పెద్ద, కులం, మతం తేడా లేకుండా స్వాగతం పలికారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొనడంతో మందడంలో భారీ జన సందోహం నెలకొంది. పెద్దఎత్తున బాణసంచా కాలుస్తూ చంద్రబాబుకు ఘనస్వాగతం పలికారు. అంతకుముందు చంద్రబాబు విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రికి చేరుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. తిరుమల పర్యటన ముగించుకొని ఇంద్రకీలాద్రికి చేరుకున్న సీఎంకు దేవాదాయ శాఖ కమిషనర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, ఆలయ ఈవో ఘన స్వాగతం పలికారు.

## సియం ముఖ్య కార్యదర్శిగా యం.రవిచంద్ర పదవీ బాధ్యతలు



**అమరావతి** జూన్ 13 (సూర్య వాస్తవం):ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా యం.రవిచంద్ర గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈమేరకు రాష్ట్ర సచివాలయం మొదటి బ్లాకులో ఆయన సియం ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా వేదపండితులు ఆయనకు దివ్య ఆశిస్సులు అందించారు. అనంతరం పలువురు అధికారులు,సిబ్బంది రవిచంద్రకు పుచ్ఛ గుచ్చాలు అందించి శుభా కాంక్షలు తెలియజేశారు.తదుపరి ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ను మర్యాద పూర్వకంగా కలిశారు.అంతకు ముందు టిఆర్అండ్బి ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న,గుంటూరు జిల్లా కలక్టర్ యం.వేణు గోపాల్ రెడ్డి,ఎస్పి తుషార్ గూడి,న్యాయశాఖ కార్యదర్శి సత్య ప్రభాకర్,ప్రోటోకాల్ డైరక్టర్ బాల సుబ్రహ్మణ్యం రెడ్డి,సచివాలయ వివిధ విభాగాల అధికారులు,సిబ్బంది,ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అందుబాటులోకి విమాన సర్వీసులు తెస్తాం

### కేంద్రమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రామ్మోహన్ నాయుడు



న్యూఢిల్లీ,జూన్ 13 (సూర్య వాస్తవం): కింజారపు రామ్మోహన్ నాయుడు కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలోని తన కార్యాలయంలో మధ్యాహ్నం 1:10 గంటల సమయంలో కేంద్ర పౌర విమానా శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. దేశంలో అత్యంత పిన్న వయసులో కేంద్ర కేబినెట్ మంత్రి పదవి రామ్మోహన్ చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన.. శ్రీకాకుళం ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. సీఎం చంద్రబాబు తనకు కేంద్ర మంత్రిగా అవకాశం ఇచ్చారన్నారు. తనపై నమ్మకంతో ప్రధాని నరేంద్ర మోదీ.. పౌర విమాన యాన శాఖ అప్పగించారన్నారు. 2లో

# ఎపిని నంబర్‌వన్‌గా తీర్చి దిద్దుతా

మొదటి పేజీ తరువాయి

అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. శ్రీవారి ఆశీస్సుల కారణంగానే తమ కూటమి విజయం సాధించిందన్నారు. రాష్ట్ర ప్రజలు చారిత్రాత్మక తీర్పునిచ్చారని.. 93 శాతం స్ట్రైక్ రేట్ గతంలో ఎప్పుడూ రాలేదన్నారు. తన ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీతో పాటు.. కేంద్ర మంత్రులు, పలువురు ప్రముఖులు హాజరయ్యా రన్నారు. తాను ఏ కార్యం చెయ్యాలన్నా ముందుగా తన కుల దైవమైన వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు పొందుతా నని చంద్రబాబు చెప్పుకొచ్చారు. 2003లో స్వామి వారికి వస్త్రాలు సమర్పించేందుకు వచ్చే సమయంలో నాపై క్లైమోర్ మైన్‌లతో దాడి చేశారు. ఆ దాడిని చూస్తే ఎవరు బ్రతకరు. కానీ శ్రీవారి ఆశీస్సులతో బయటపడ్డాను. దేవాన్ష్ పుట్టినరోజు నాడు శ్రీవారి అన్నదానానికి ప్రతి ఏటా విరాళం ఇస్తున్నాం. నేను ప్రతి రోజు గంటల తరబడి పూజలను చెయ్యను. ఒక్క నిమిషం మాత్రమే ధ్యానం చేస్తాను. శ్రీవారిని ఒక్కటే కోరుకుంటా. రాష్ట్ర ప్రజలు బాగుండాలి. దేశం అభివృద్ధి చెందాలి. సంపదను సృష్టించి పేద ప్రజలకు పంచే అవకాశం ఇవ్వాలని కోరుకుంటానని అన్నారు. హైదరాబాద్‌ని 1.0 విజన్‌తో అభివృద్ధి చేశాను. అప్పుడు చేసిన అభివృద్ధిని చూసి ప్రపంచంలోని దేశాధినేతలు హైదరాబాద్‌కి వచ్చారు. భారతదేశంలోని కుటుంబ వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శం. నేను జైలులో ఉన్న ప్పుడు నన్ను ఆదుకున్నది కుటుంబ వ్యవస్థనే. తిరువళ్ళ శనివారాల్లో ఉపవాసం వుండి స్వామి వారికీ పూజలు చేస్తాం. స్వామి వారి దర్శనానికి వచ్చే వాళ్ళు మళ్ళీ మళ్ళీ వచ్చి స్వామి వారిని దర్శించుకుం టుంటారు. మన రాష్ట్రం, దేశంలోనే కాకుండా ప్రపంచంలో కూడా శ్రీవారి ఆలయాలు నిర్మించే విధంగా ముందుకు వెళ్తాం.' అని చంద్రబాబు చెప్పారు. పేదరికంలేని సమాజాన్ని నిర్మించేందుకు ప్రయత్నిస్తా. ఆర్థిక అసమానతలు లేని విదంగా చర్యలు చేపడుతాం. టీటీడీతోనే ప్రక్షాళన ప్రారంభం అవ్వాలి. నా పర్యటన లోనూ పరదాలు కడుతున్నారు. టీటీడీలో పెద్ద ఎత్తున్న అవకతవకలు జరిగాయి. జనాలనూ నా దగ్గరకు రానివ్వకుండా కర్ఫ్యూ వాతావరణం సృష్టించారు. నా కుటుంబానికి నేను ఏమి ఇవ్వాల్సిన అవసరం లేదు. 30 ఏళ్ల క్రితమే వాళ్ళకి వ్యాపారం పెట్టించా. ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలబడాలని పిలుపునిచ్చా.. నా పిలుపు మేరకు ప్రజలు మాకు అధికారం ఇచ్చారు. దురదృష్టం వల్ల అమరావతి, పోలవరం పడకేసింది. ఈ రెండింటిని అభివృద్ధి చెయ్యాలి. తిరుమల ఒక పవిత్రమైన దివ్య క్షేత్రం. తిరుమలని అపవిత్రం చెయ్యడం భావ్యం కాదు. వైకుంఠం ద్వారా స్వామి వారిని దర్శించుకోవడం మంచి అనుభూతిని ఇస్తుంది. తిరుమలని ప్రక్షాళన చేస్తా. దేశం గర్వపడేలా ప్రక్షాళన జరుగుతుందన్నారు. తిరుమలని దరిద్రపు ప్రాంతంగా తయారు చేశారు. గత ఐదేళ్లలో తిరుమలలో వీరు చెయ్యని అరాచకం లేదు. తిరుమల కొండపై అపచారం చేసిన వాళ్ళు ఈ జన్మలోనే శిక్ష అనుభవిస్తారు. మంచిని ప్రోత్సహిస్తా.. రౌడీయిజాన్ని అణచి వేస్తా' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. గతంలో తిరుమలలో అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంతో పాటు, ఔషధ మొక్కలను పెంచి అభివృద్ధి చేశామని అన్నారు. తిరుమలకు వస్తే ఆరోగ్యం పెరగాలి అన్నదే తన సంకల్పం అన్నారు.

# పేదలకు అందుబాటులోకి విమాన సర్వీసులు తెస్తాం

మొదటి పేజీ తరువాయి

వంద రోజుల యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అన్ని శాఖలను మోదీ కోరారని మంత్రి చెప్పుకొచ్చారు. 'కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టడం చాలా ఆనందంగా ఉంది. భగవంతుడు, మా నాన్న ఎర్రన్న నాయుడు ఆశీస్సులు నాకు ఉన్నాయి. బాధ్యత రావడానికి కారణమైన చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్, శ్రీకాకుళం తెలుగు ప్రజలకు ధన్యవాదాలు. పౌర విమానయాన శాఖ కేటాయించిన మోదీకి కృతజ్ఞతలు. దేశంలో, ప్రపంచంలో అత్యధికంగా అభివృద్ధి సాధిస్తున్న రంగం విమానయాన రంగం. యువతకు బాధ్యత ఇస్తే సమర్థవంతంగా నిర్వహిస్తారని మోదీ నాకు ఈ బాధ్యత అప్పగించారు. నా శాఖను సమర్థవంతంగా నిర్వహిస్తాను. 100 రోజుల ప్రణాళిక తయారు చేస్తాం. 2047 నాటికి సివిల్ ఏవియేషన్‌లో ఏ కార్యక్రమాలు చేపట్టాలో ప్రణాళికలు రూపొందిస్తాం అని వివరించారు. అలాగే సామాన్య ప్రయాణికుల కోసం ఈస్ ఆఫ్ ఫ్లయింగ్‌పై దృష్టి పెడతాం. పర్యావరణ హితంగా మంత్రిత్వ శాఖను నిర్వహిస్తాం. భవిష్యత్తులో 100 శాతం పర్యావరణ హితంగా మంత్రిత్వ శాఖ కార్యక్రమాలు నిర్వహిస్తాం' అని రామ్మోహన్ చెప్పారు. 'ఎయిర్ పోర్టుల నిర్మాణం వేగవంతం చేస్తాం. సామాన్యులకు విమానయాన రంగాన్ని చేరువ చేస్తాం. విమానయాన రంగానికి పునాదులు వేసిన వ్యక్తి అశోక్ గజపతి రాజు. ఉడాన్ స్కీమ్ ద్వారా సామాన్యులకు విమాన ప్రయాణం చేరువైంది. జ్యోతిరాదిత్య సింధియా సూచనలు తీసుకున్నాను. డీజీ యాత్రను విమానాశ్రయాలకు విస్తరిస్తాం. సివిల్ ఏవియేషన్ ఆఫ్ ఇండియా బెస్ట్‌గా తీర్చిదిద్దుతాం అన్నారు. మోదీ, చంద్రబాబు విజనరీ లీడర్స్. వారిద్దరి లీడర్ షిప్‌లో పౌర విమానయాన శాఖను ముందుకు తీసుకువెళతాను. భోగాపురం ఎయిర్ పోర్టును రికార్డు సమయంలో పూర్తి చేసి విమానాలు ల్యాండ్ చేస్తాం. విజయవాడ, తిరుపతికి కనెక్టివిటీ పెంచుతాం. రాజమండ్రి, కడప, కర్నూలు విమానాశ్రయాలు అభివృద్ధి చేస్తామని వివరించారు. ఏవియేషన్ రంగంలో స్కిల్ డెవలప్మెంట్‌ను ఏపీ నుంచి ప్రారంభిస్తాను. ఏపీ, తెలంగాణ సహా రాష్ట్రాల వారిగా విమానాశ్రయాల అభివృద్ధిని వేగవంతం చేస్తాం. విజయవాడ టెర్మినల్ నిర్మాణం పూర్తి చేస్తాం. విజయవాడ ఎయిర్ పోర్ట్ కనెక్టివిటీ పెంచుతాం' అని కేంద్ర మంత్రి రామ్మోహన్ వెల్లడించారు.

# 22 న జిఎస్ టి మండలి సమావేశం



న్యూఢిల్లీ జూన్ 13 (సూర్య వాస్తవం): వస్తువులు, సేవల పన్ను(జిఎస్ టి) మండలి జూన్ 22 న సమావేశం కావాలని నిర్ణయించింది. ఈ సమావేశం ఈ ఏడాది తొలి సమావేశం కానున్నది. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం తెలిపారు. ఈ 53వ జిఎస్ టి కౌన్సిల్ సమావేశం జూన్ 22న న్యూఢిల్లీలో జరుగనుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.జిఎస్ టి కౌన్సిల్ సాధారణంగా ప్రతి మూడు నెలలకొకసారి సమావేశం కావల్సి ఉంటుంది. కానీ 2022 నుంచి ఇప్పటి వరకు కేవలం ఆరు సార్లే సమావేశం అయింది. జరుగనున్న జిఎస్ టి కౌన్సిల్ సమావేశం ఎజెండా ఏమిటన్నది తెలియలేదు. అయితే రాష్ట్ర ఆర్థిక మంత్రులు కొన్ని పరోక్ష పన్నులను కేంద్ర బడ్జెట్ లో చేర్చాలని కోరవచ్చని అనుకుంటున్నారు.బెట్టింగ్ వాటి మీద జిఎస్ టి 28 శాతం వేయడం వల్ల జిఎస్ టి ఆదాయం గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా ఆన్ లైన్ గేమింగ్, క్యాసినోలు, గుర్రపు పందేలు వంటి వాటిమీద అధిక జిఎస్ టి విధించబడుతోంది. గుర్రపు పందేలాడేవారికి జిఎస్ టి తో పాటు ఎంట్రీ ఫీజు కూడా గణనీయంగా ఉంది. హైదరాబాద్ లో ఆఫ్ కోర్స్ టోటల్ ఎంట్రీ ఫీజు రూ. 150 వరకు ఉంది. ఇక రేస్ కోర్స్ మెయిన్ ఎంట్రీ ఫీజులోనే దీనికంటే డబల్ ఉంటుంది. జిఎస్ టి రేట్లు హేతుబద్ధంగా ఉన్నాయా అన్నది ప్రశ్న.

# బాధ్యతలు చేపట్టిన కేంద్రమంత్రులు




న్యూఢిల్లీ, జూన్ 13 (సూర్య వాస్తవం): కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్.. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లోని హోంశాఖ కార్యాలయంలో బండి సంజయ్ బాధ్యతలు చేపట్టారు. భద్రతా కారణాల రీత్యా కార్యకర్తల అట్టహాసం, నాయకుల సందడి లేకుండానే ఛార్జ్ తీసుకున్నారు. జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామీజీ సమక్షంలో హోం మంత్రిత్వ శాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు ఫైళ్లపై సంతకాలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో దేశ భద్రత కోసం పనిచేసేందుకు అహర్నిశలు కృషిచేస్తానని బండి సంజయ్ పేర్కొన్నారు.కాగా.. బండి సంజయ్ కుమార్.. 2019లో తొలిసారిగా కరీంనగర్ నుంచి ఎంపీగా గెలిచారు. తరువాత భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ వ్యాప్తంగా పార్టీ విస్తరణకు చర్యలు తీసుకున్నారు. 2020 మార్చి 11 నుంచి 2023 జులై 3వ వరకు రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో పార్టీకి సేవలందించారు. ప్రస్తుతం :ఏఖ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పని చేస్తూ.. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రెండోసారి ఎంపీగా గెలిచారు. దీంతో కేంద్ర సహాయ మంత్రి పదవి దక్కించుకున్నారు. కిషన్ రెడ్డి ఢిల్లీ శాస్త్రి భవన్‌లో బొగ్గు, గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు కిషన్ రెడ్డి. అంతకుముందు తెలంగాణ భవన్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అలాగే కుటుంబ సమేతంగా తెలంగాణ భవన్‌లోని పలు ఆలయాల్లో ప్రత్యే పూజలు చేశారు. అనంతరం బంగ్లా సాహిబ్ గురుద్వారాను దర్శించుకోనున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. తెలంగాణ భవన్ బయట ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి వందనం సమర్పించారు. ఆ తర్వాత.. అమరవీరుల స్తూపం వద్దకు వెళ్లికూడా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. సికింద్రాబాద్ నుంచి వరుసగా గెలుపొందుతున్న బీజేపీ కీలక నేత, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ సర్కార్ కీలక శాఖలను కేటాయిస్తూ వచ్చింది. ముందు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న ఆయనకు గత ఎన్నికల్లో ఎంపీగా గెలిచినందుకు కేంద్ర సాంస్కృతిక శాఖను అప్పగించింది. ఈసారి అత్యంత కీలకమైన కేంద్ర బొగ్గు, గనుల శాఖను కేటాయించడంతో తెలుగు రాష్ట్రాలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని పలువురు భావిస్తున్నారు. మోదీ హయాంలో కోతలు లేకుండా విద్యుత్ అందిస్తున్నామని అన్నారు. 'అన్ని రాష్ట్రాల్లో గత పదేళ్లలో ప్రధాని మోదీ విద్యుత్ కొరతకు చెక్ పెట్టారు. ఆయన నాయకత్వంలో గత పదేళ్ల నుంచి వ్యవసాయానికి, పరిశ్రమలకు, గృహాలకు సరిపోను కరెంట్ వస్తోంది. దానికి ప్రధానమైన కారణం.. బొగ్గు. దీని ద్వారానే ఈ రోజు ఎక్కువ శాతం విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. ప్రస్తుతం ఇతర దేశాల నుంచి మనం కొంత దిగుమతి చేసుకుంటున్నాం. రానున్న రోజుల్లో మన అవసరాలకు సరిపోయేలా దేశీయంగా బొగ్గు ఉత్పత్తి పెంచుతాం. ఖనిజాల అన్వేషణ, తవ్వకాల ద్వారా ఉపాధి అవకాశాలను పెంచడం, భారత్ ఖనిజాలను ఇతర దేశాలకు ఎగుమతి చేసి ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా కృషి చేస్తాం. అధికారులందరితో కలిసి టీమ్ వర్క్‌తో పనిచేసి భారత్‌ను అగ్రపథంలో నడిపించేందుకు క్రమశిక్షణతో, చిత్తశుద్ధితో పనిచేస్తా.' అని కిషన్ రెడ్డి తెలిపారు.

# కౌన్సెలింగ్ కొనసాగుతుంది..మేము దానిని ఆపం : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ జూన్ 13 (సూర్య వాస్తవం):నీట్ యూజీ 2024 కౌన్సెలింగ్‌పై స్టే ఇవ్వబోమని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ నీట్ కౌన్సిలింగ్ నిలిపివేతకు గురువారం (జూన్ 13) నో చెప్పింది. 'కౌన్సెలింగ్ కొనసాగుతుంది. మేము దానిని ఆపం. వారికి మళ్లీ ఎగ్జామ్ జరిగితే అంతా సజావుగా మారుతుంది. కాబట్టి భయపడాల్సిన పనిలేదని' సుప్రీం కోర్టు పేర్కొంది. నీట్ యూజీ పరీక్ష సమయంలో నష్టపోయిన సమయాన్ని భర్తీ చేయడానికి 'గ్రేస్ మార్కులు' పొందిన 1563 మంది అభ్యర్థుల ఫలితాలను సమీక్షించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు ఎన్టీయే విచారణ సమయంలో సుప్రీంకోర్టుకు తెలిపింది. గ్రేస్ మార్కులు పొందిన 1,563 నీట్ యూజీ అభ్యర్థుల స్కోర్‌కార్డులను రద్దు చేయాలని కమిటీ నిర్ణయం తీసుకుందని, ఆ ప్రకారంగా ఈ విద్యార్థులకు గ్రేస్ మార్కులు తొలగిస్తామని సుప్రీంకోర్టు కి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తెలిపింది. వీరికి మరోసారి పరీక్ష రాసే అవకాశం కూడా కల్పిస్తామని వెల్లడించింది. జూన్ 23న పరీక్షలు నిర్వహించి, జూన్ 30లోపు ఫలితాలు ప్రకటిస్తామని ఎన్టీయే అత్యున్నత ధర్మాసనానికి తెలిపింది.కాగా వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పేపర్ లీక్ ఆరోపణలతో పాటు ఫలితాల వివాదం తీవ్ర దుమారం రేపుతోంది. నీట్ ఎగ్జామ్ రద్దు చేసి మళ్లీ నిర్వహించాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేసింది. నీట్ పరీక్షను రద్దు చేయడం అంత సులువు కాదని స్పష్టం చేసింది. క్యాన్సిల్ చేస్తే పరీక్షకు ఉన్న గౌరవం, పవిత్రత దెబ్బతింటుందని, అలాగే కౌన్సెలింగ్ ప్రక్రియపై స్టేకు కూడా సుప్రీంకోర్టు నిరాకరించింది. పరీక్షపై వస్తున్న ఆరోపణలకు సమాధానాలు కావాలని ఎన్టీయేను ధర్మాసనం ఆదేశించింది. ఎగ్జామ్‌లో జరిగిన అవకతవకలపై వివరణ ఇవ్వాలంటూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఔుం)కి నోటీసులు జారీ చేసింది.మే 5న నీట్ యూజీ-2024 ప్రవేశ పరీక్ష జరిగింది. అయితే మొదట జూన్ 14న ఫలితాలను వెల్లడిస్తామని చెప్పిన అధికారులు.. అంతకంటే ముందే జూన్ 4న రిజల్ట్ విడుదల అయ్యాయి. నీట్ ఫలితాల్లో 67 మంది విద్యార్థులకు ఆలిండియా మొదటి ర్యాంక్ రాగా, వారిలో ఒకే పరీక్ష కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడం పలు అనుమానాలకు దారితీసింది. దీంతో పేపర్ లీకేజీ జరిగిందని, ఫలితాల్లోనూ అక్రమాలు చోటు చేసుకున్నాయని కాంగ్రెస్ సహా పలు విపక్షాలు ధ్వజమెత్తాయి. దీంతో ఆరోపణలపై విచారణకు యూపీఎస్సీ మాజీ ఛైర్మన్ సారథ్యంలో కేంద్రం నలుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది.నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై దాఖలైన పిటిషన్లపై జూన్ 13న విచారణ జరిపిన సుప్రీంకోర్టు వెబ్‌కౌన్సెలింగ్‌పై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. కౌన్సెలింగ్ యథాతథంగా ఉంటుందని స్పష్టం చేసింది . ఈ పిటిషన్లపై రెండు వారాల్లోగానే సమాధానం చెప్పాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఔుం)కి నోటీసులు జారీ చేసింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను జులై 8కి వాయిదా వేసింది. ప్రకటించిన షెడ్యూలు ప్రకారం జులై 6 నుంచి నీట్ కౌన్సెలింగ్ ప్రారంభంకానుంది. జూన్ 12న ఇదే అంశంపై ఢిల్లీ హైకోర్టులోనూ విచారణ జరిగింది. ఢిల్లీ హైకోర్టు కూడా కౌన్సెలింగ్‌పై స్టేను నిరాకరిస్తూ..తదుపరి విచారణనకు జులై 5కి వాయిదావేసిన సంగతి తెలిసిందే.

# అందరి సహకారంతో ప్రెస్ క్లబ్ భవనం నిర్మిస్తాం

## - ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తమ్మిశెట్టి రంగ సురేష్



తాడేపల్లిగూడెం జూన్ 13 (సూర్య వాస్తవం): ప్రెస్ క్లబ్, ఇతర యూనియన్ సభ్యుల సహకారంతో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి కృషి చేస్తామని తాడేపల్లిగూడెం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రంగ సురేష్ తెలిపారు. గురువారం తాడేపల్లిగూడెం విచ్చేసిన మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే శ్రీనివాస్ లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి జర్నలిస్టుల సమస్యలను విన్నవించారు. అనంతరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రంగ సురేష్ మాట్లాడుతూ జర్నలిస్టులకు సొంత ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం, ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం, పిల్లల స్కూల్ ఫీజుల్లో 50% రాయితీ వంటి సమస్యలు పరిష్కారానికి వారు సానుకూలంగా స్పందించారన్నారు. తాడేపల్లిగూడెం ప్రెస్ క్లబ్ బలంగా ఉందన్నారు. అందరి సభ్యుల సహకారంతో ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి గొలిమే బుజ్జిబాబు మాట్లాడుతూ ఎంతోకాలంగా జర్నలిస్టుల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. తమ సమస్యల పరిష్కారానికి మంత్రి రామానాయుడు, ఎమ్మెల్యే శ్రీనివాస్ సానుకూలంగా స్పందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ప్రెస్ క్లబ్ మాజీ ప్రధాన కార్యదర్శి మైలవరపు రవికిరణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జర్నలిస్టులు ఊపిరి పీల్చుకున్నారన్నారు. పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్న రామానాయుడు, ఎమ్మెల్యే శ్రీనివాస్ లకు ధన్యవాదాలు తెలిపారు. ప్రెస్ క్లబ్ కోశాధికారి శీలి రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సరిపల్లి కుమార్ రాజు, సభ్యులు కొత్తపల్లి గోపి, బాసం శెట్టి బాల బాలాజీ, సుందర నీడి లక్ష్మయ్య, ఆదినారాయణ, శివ, బాలాజీ, చిన్న, అయితం ప్రసాద్, కృష్ణ, మణి, గారపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వాసవి మాతా ఆలయంలో సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం జూన్ 13 (సూర్య వాస్తవం): తాడేపల్లిగూడెం ఏలూరు రోడ్ లో వేంచేసి ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో జేష్ఠ మాసం సప్తమి గురువారం పురస్కరించుకొని సూర్యనారాయణ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా విఘ్నేశ్వర పూజ అనంతరం స్వామివారి మూలవిరాట్ కు పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, ఫల రసాలతో విశేషాలు ఆలయ పురోహితులు సత్యనారాయణ శర్మ తరుణ్ శర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ కార్యదర్శి నున్న బాలత్రిపుర సుందర్రావు దంపతులు పూర్వాధ్యక్షుల పేరూరు కాశి దంపతులు ఆలయ కార్యదర్శి ఆలపాటి సత్యనారాయణ పాల్గొన్నారు. స్వామివారికి నీరాజన్న మంత్రపుష్పం మరియు విశేష అలంకరణ జరిగింది కార్యదర్శి మాట్లాడుతూ సప్తమి పరిష్కరించుకొని తాడేపల్లిగూడెంలో ఉన్న ఏకైక సూర్యనారాయణ స్వామి ఆలయంలో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించామని ప్రజలందరూ తలంపుతో పూజారి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు విశేష సంఖ్య లో భక్తులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ...

తుగ్గలి జూన్ 13 (సూర్య వాస్తవం): 2024-25 విధ్యా సంవత్సరానికి సంబంధించి వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలు గురువారం రోజున పున ప్రారంభం అయ్యాయి.పాఠశాలలు ప్రారంభం కావడంతో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని మరియు విద్యార్థులకు సంబంధించిన స్టూడెంట్ కిట్స్ ను మండల విద్యాధికారి రామా వెంకటేశ్వర్లు,పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు విద్యార్థులకు గురువారం రోజున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ రమా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తుగ్గలి మండల పరిధిలోని గల 66 ప్రభుత్వ పాఠశాలలకు స్టూడెంట్ కిట్స్ ను పంపిణీ పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు.స్టూడెంట్ కిట్స్ నందు విద్యార్థులకు సంబంధించిన టెక్స్ట్ బుక్స్,వర్క్ బుక్స్,నోట్ బుక్స్, నిఘంటువు,బ్యాగ్,మూడు జతల యూనిఫామ్,షూ మరియు బెల్ట్ లను విద్యార్థినీ విద్యార్థులకు పంపిణీ చేసినట్లు ఎంఈఓ తెలియజేశారు. గురువారం రోజున మండల కేంద్రమైన తుగ్గలి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ఎంఈఓ రమా వెంకటేశ్వర్లు,ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి,ఉపాధ్యాయులు రాజ మోహన్,సుధాకర్ గౌడ్,నారాయణ, ఫిజికల్ డైరెక్టర్ చందు నాయక్ తదితర బోధనా సిబ్బంది పాల్గొని విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ ను పంపిణీ చేశారు.

# హత్యకేసులో కన్నడ నటులు అరెస్టు

బెంగళూరు జూన్ 13 (సూర్య వాస్తవం): ప్రముఖ కన్నడ నటుడు దర్శన్ తూగుదీప ఒ నటి పవిత్ర గౌడ తమ అభిమానిని హత్య చేసిన కేసులో అరెస్టు చేశారు. అభిమాని రేణుకా స్వామి మృతదేహం జూన్ 9న బెంగళూరు డ్రెయిన్లో లభ్యమైంది. దర్శన్కు చెందిన జీపుతో సహా హత్యకు ఉపయోగించిన కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దర్శన్ ను మైసూర్ ఫామ్హౌస్ లో అరెస్టు చేసారు. ఈ కేసుకు సంబంధించి దర్శన్తో పాటు మరో 11 మంది నిందితులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# భూపాలపల్లి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం: ఇద్దరు మృతి

భూపాలపల్లి జూన్ 13 (సూర్య వాస్తవం): తెలంగాణ జిల్లాల్లో రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఓవర్టెక్, మద్యం తాగి నడపడం, అతి వేగం తదితర కారణాల వల్ల ప్రతిరోజు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల వల్ల ఎందరో అమాయకులు బలవుతు న్నారు. కుటుంబాలు చిన్నభిన్నమవుతున్నాయి. తాజాగా. ఈరోజు భూపాల పల్లిజిల్లా దామరకుంట, విలాసాగర్,గ్రామాల మధ్య ఈరోజు మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసు కుంది, వివరాలు కి వెళ్తే. దామర కుంట,నుండి గంగారం వైపు బైకుపై వెళ్తున్న అట్ల బాపు, విలాసాగర్ గ్రామానికి చెందిన కాపర బోయిన రాజయ్య అవసరం నిమిత్తము విలాసాగర్ నుండి దామరకుంట వెళుతున్న క్రమంలో రెండు బైకులు ఎదురుగా ఢీకొన్నాయి. దీంతో ఇద్దరు కింద పడి పోగా, వారి వెనకాలే వస్తున్న ఇసుక ట్రాక్టర్ అదుపు తప్పి ఇద్దరు వ్యక్తుల పై నుండి వెళ్లిపోవడంతో అట్ల బాపు అక్కడే మృతిచెందగా, తీవ్ర గాయాలతో ఉన్న రాజయ్య ను కాటారం ప్రభుత్వ ఆసు పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో చనిపోయాడు. సంఘటన స్థలానికి చేరు కున్న కాటారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. సంఘటనకు సంబంధించిన మరికొన్ని వివరాలు తెలియవలసి ఉంది...

# శకుని పాచికల్లా ఎన్నికల ఫలితాలు

- ఇవిఎంలపై దేశవ్యాప్త చర్చ జరగాలి
- మండలిలో గట్టిగా పోరాటం చేసే దమ్ము ఉంది
- వైకాపా ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేసిన జగన్



విజయవాడ,జూన్ 13 (సూర్య వాస్తవం): ఎన్నికల ఫలితాలు శకుని పాచికల మాదిరి ఉన్నాయంటూ వైకాపా అధ్యక్షుడు జగన్ వివరించారు. ఈవీఎంలపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలని జగన్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, జనసేన హనీమూన్ నడుస్తోందని.. వారికి మరికొంత సమయం ఇచ్చి..తర్వాత పోరాడుదాం.. అంటూ ఎమ్మెల్సీలకు వివరించారు. శాసనసభలో అధికార పార్టీ నోరు కట్టడి చేసే అవకాశం ఉందని జగన్ అన్నారు. శాసనమండలిలోనైనా గట్టిగా ప్రభావం చూపాలని వైసీపీ ఎమ్మెల్సీలకు జగన్‌మోహన్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.. ఎలాంటి ప్రలోభాలకు లొంగొద్దని.. కేసులు పెట్టినా భయపడొద్దు.. అంటూ సూచించారు. గురువారం వైఎస్ జగన్ వైసీపీ ఎమ్మెల్సీలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీలు ఎలాంటి ప్రలోభాలకు లొంగొద్దని.. కేసులు పెట్టినా భయపడొద్దు.. అంటూ ఎమ్మెల్సీలకు సూచించారు. 40 శాతం ప్రజలు మనవైపే ఉన్నారంటూ గుర్తుచేశారు. మనం చేసిన మంచి పనులు ప్రజలకు గుర్తున్నాయి.. అసెంబ్లీలో తమ నోరును కట్టడి చేసే అవకాశం ఉందని.. మండలిలో గట్టిగా పోరాడుదాం అంటూ జగన్ సూచించారు. ఇటీవల జరిగిన జనరల్ ఎలక్షన్‌లో ఘోర ఓటమిపాలైన వైసీపీకి, శాసనమండలిలో మాత్రం 39 మంది ఎమ్మెల్సీల బలం ఉంది. త్వరలో అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీలతో జగన్ సమావేశమై పలు అంశాలపై చర్చించారు. శాసనమండలిలో అనుసరించాల్సిన వ్యూహంపై ఎమ్మెల్సీలకు దిశానిర్దేశర చేశారు. ప్రధానంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతోపాటు ఇతర కీలక బిల్లులను త్వరలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన మరికొన్ని బిల్లులను కూడా ఉపసంహరించే ఛాన్స్ ఉంది. ఈ క్రమంలో శాసనసభలో బలం లేకపోయినా.. మండలిలో ఉన్న బలంతో ఆయా బిల్లుల విషయంలో ప్రభుత్వ నిర్ణయాల్ని ప్రశ్నిస్తూ ప్రతిఘటనకు అవకాశం ఉంటుంది. అలాగే అధికార పార్టీ ప్రవేశపెట్టిన బిల్లులు ఆమోదం పొందాలంటే మండలిలో తగినంత బలం ఉండాలి. ఈ క్రమంలో ప్రలోభాలకు లోనుకాకుండా ప్రజా సమస్యలపై పోరాడాలని ఎమ్మెల్సీలకు వైఎస్ జగన్ సూచించినట్లు తెలుస్తోంది. ఇదిలాఉంటే.. రాష్ట్ర వ్యాప్త పర్యటనకు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సిద్ధమైనట్లు చర్చ జరుగుతోంది.. టీడీపీ నేతల దాడులకు గురైన బాధితులను పరామర్శించాలని ఎమ్మెల్సీల సమావేశంలో స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల తర్వాత జరిగిన దాడులపై కేంద్రానికి, రాష్ట్రపతికి ఫిర్యాదు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం..

# జగన్ పై ఇక నో కామెంట్స్...



విజయవాడ, జూన్ 13 (సూర్య వాస్తవం): మాజీ ఎంపీ టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి తాను జగన్ గురించి వ్యక్తిగతంగా మాట్లాడబోనని ప్రకటించారు. భీమవరంలో మీడియా సమావేశంలో ఆయనీ వ్యాఖ్యలు చేశారు. వైసీపీ రెబల్ ఎంపీగా మారినప్పటి నుండి రఘురామకృష్ణరాజు ప్రతీ రోజూ రచ్చబండ పేరుతో ప్రెస్ మీట్ పెట్టి జగన్ పై విమర్శలు గుప్పించేవారు. ఇప్పుడు హఠాత్తుగా ఇకపై జగన్ గురించి మాట్లాడబోనని ఆయన ప్రకటించడం ఆశ్చర్యకరంగా మారింది. అయితే దీనికి ఆయన తన వివరణ ఇచ్చారు. జగన్ మా మంచో చెడో చేయాల్సింది చేశాడు వెళ్లిపోయాడని ఇప్పుడు ప్రజలు ఆ విషయం పట్టించుకోరన్నారు. ప్రజల దృష్టి ఇప్పుడు టీడీపీ పాలనపై ఉంటుందన్నారు. హామీలను నెరవేర్చాలని ప్రజలు కోరుకుంటారని అందుకే మేం కూడా మా హామీలను అమలు చేసే విషయంపైనే దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. జగన్ పై కానీ, వైసీపీ పైన కానీ ప్రజల దృష్టి ఉండదన్నారు. తాను మళ్లీ విమర్శలు చేస్తే ప్రజల దృష్టి అటు మళ్లుతుందని.. అలా ఉండకూడదు రఘురామ స్పష్టం చేశారు. ప్రజలు మనకు అధికారం ఇవ్వలేదు, బాధ్యతను కట్టబెట్టారని చంద్రబాబు చెప్పారని రఘురామ గుర్తు చేసుకున్నారు. టీడీపీ నేతలు దాడులు చేయవద్దని.. తప్పు చేసిన వాళ్లను చట్టప్రకారం శిక్షించాలన్నారని చంద్రబాబు చెప్పారని రఘురామ అన్నారు. అందుకే తనపై జరిగిన కస్టోడియల్ దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశానన్నా రు. ఆసుపత్రి నివేదిక ప్రకారం తనపై కస్టోడియల్ టార్చర్ జరిగిందని స్పష్టంగా తెలుస్తోందని చెప్పారు. అలాంటిది నాను నేనే న్యాయం చేసుకోకుంటే సామాన్యులకు న్యాయం జరుగుతుందనే నమ్మకం పోతుందని దీనిని దృష్టిలో ఉంచుకునే పోలీసులకు ఫిర్యాదు చేశానని గుర్తు చేశారు. ఒకటి రెండు రోజుల్లో ఎఫ్ఐఆర్ నమోదవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయంపై తాను ఎవరితోనూ మాట్లాడలేదని, ఎవరి సూచనల మేరకో తాను ఫిర్యాదు చేయలేదన్నారు.ఏపీలో హింస జరుగుతోందని వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలను కూడా రఘురామ కొట్టి పడేశారు. ఇద్దరు వ్యక్తలు కొట్టుకుంటే దెబ్బతిన్న వ్యక్తికి వైసీపీ ముసుగేసి చంపేస్తున్నారని హడావిడి చేస్తున్నారని విమర్శించారు. పందాలు కాసిన వాళ్ళు కొంతమంది ఆత్మహత్య చేసుకుంటున్నారని.. దానిని వైసీపీ ప్రభుత్వం రాలేదని చనిపోయినట్టు చిత్రీకరిస్తున్నారని విమర్శించారు. ఈ ఆత్మహత్యలకు జగన్ రెడ్డి ఓదార్పు యాత్ర 2.0 స్టార్ట్ చేస్తారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. టీడీపీ కూటమి విజయంలో క్షత్రియుల పాత్ర చాలా ఎక్కువగా ఉందన్నారు. క్షత్రియులకు ఎవరో ఒకరికి ఏదో ఒక పదవి ఇస్తారని అనుకుంటున్నానని రఘురామ నమ్మకం వ్యక్తం చేశారు.

# మండలిలో చుక్కలు చూపిద్దాం...

విజయవాడ, జూన్ 13 (సూర్య వాస్తవం): శాసనసభలో నోరు కట్టడి చేసే అవకాశం ఉంది? శాసనమండలిలోనైనా గట్టిగా ప్రభావం చూపాలని వైసీపీ ఎమ్మెల్సీలకు ఆపార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.. ఎలాంటి ప్రలోభాలకు లొంగొద్దని.. కేసులు పెట్టినా భయపడొద్దు.. అంటూ సూచించారు. గురువారం వైఎస్ జగన్ వైసీపీ ఎమ్మెల్సీలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీలు ఎలాంటి ప్రలోభాలకు లొంగొద్దని.. కేసులు పెట్టినా భయపడొద్దు.. అంటూ ఎమ్మెల్సీలకు సూచించారు. 40 శాతం ప్రజలు మనవైపే ఉన్నారంటూ గుర్తుచేశారు. మనం చేసిన మంచి పనులు ప్రజలకు గుర్తున్నాయి.. ఎన్నికల ఫలితాలు శకుని పాచికల మాదిరి ఉన్నాయంటూ వివరించారు. ఈవీఎంలపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలని జగన్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, జనసేన హనీమూన్ నడుస్తోందని.. వారికి మరికొంత సమయం ఇచ్చి..తర్వాత పోరాడుదాం.. అంటూ ఎమ్మెల్సీలకు వివరించారు. అసెంబ్లీలో తమ నోరును కట్టడి చేసే అవకాశం ఉందని.. మండలిలో గట్టిగా పోరాడుదాం అంటూ జగన్ సూచించారు.ఇటీవల జరిగిన జనరల్ ఎలక్షన్‌లో ఘోర ఓటమిపాలైన వైసీపీకి, శాసనమండలిలో మాత్రం 39 మంది ఎమ్మెల్సీల బలం ఉంది. త్వరలో అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీలతో జగన్ సమావేశమై పలు అంశాలపై చర్చించారు. శాసనమండలిలో అనుసరించాల్సిన వ్యూహంపై ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు.ప్రధానంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతోపాటు ఇతర కీలక బిల్లులను త్వరలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన మరికొన్ని బిల్లులను కూడా ఉపసంహరించే ఛాన్స్ ఉంది. ఈ క్రమంలో శాసనసభలో బలం లేకపోయినా.. మండలిలో ఉన్న బలంతో ఆయా బిల్లుల విషయంలో ప్రభుత్వ నిర్ణయాల్ని ప్రశ్నిస్తూ ప్రతిఘటనకు అవకాశం ఉంటుంది. అలాగే అధికార పార్టీ ప్రవేశపెట్టిన బిల్లులు ఆమోదం పొందాలంటే మండలిలో తగినంతబలం ఉండాలి. ఈ క్రమంలో ప్రలోభాలకు లోనుకాకుండా ప్రజా సమస్యలపై పోరాడాలని ఎమ్మెల్సీలకు వైఎస్ జగన్ సూచించినట్లు తెలుస్తోంది. ఇదిలాఉంటే.. రాష్ట్ర వ్యాప్త పర్యటనకు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సిద్ధమైనట్లు చర్చ జరుగుతోంది.. టీడీపీ నేతల దాడులకు గురైన బాధితులను పరామర్శించాలని ఎమ్మెల్సీల సమావేశంలోస్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల తర్వాత జరిగిన దాడులపై కేంద్రానికి, రాష్ట్రపతికి ఫిర్యాదు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

# భారీ మద్యం స్కాం... బెయిల్‌కు నిరాకరణ



విజయవాడ, జూన్ 13 (సూర్య వాస్తవం): ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. బేవరేజెస్ కార్పొరేషన్‌లో భారీ అవినీతి జరిగిందని.. కార్పొరేషన్ కార్యాలయం నుంచి ఫైళ్లు తీసుకెళ్లారని ఆయనపై సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో తనను అరెస్ట్ చేయకుండా రక్షణ కల్పించాలని కోరుతూ వాసుదేవ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని వాసుదేవ రెడ్డి తరఫు న్యాయవాదులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం.. బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. అనంతరం కేసు విచారణను జూన్ 18వ తేదీకి వాయిదా వేసింది. వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి ఏపీ ప్రభుత్వంలో పని చేస్తున్నారు. అంతకు ముందు ఆయన రైల్వే ట్రాఫిక్ సర్వీస్ ఉద్యోగిగా ఉండేవారు. అక్కడి నుంచి ఏపీ ప్రభుత్వానికి డిప్యూటేషన్ పై వచ్చారు. వచ్చినప్పటి నుంచి ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పాత బ్రాండ్లేమీ అందుబాటులో లేకుండా చేయడం దగ్గర్నుంచి వైసీపీ నేతల డిస్టిలరీల నుంచి వచ్చే మద్యమే అమ్మేలా చూశారని ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల సమయంలో ఆయనపై తీవ్రమైన ఆరోపణలు రావడంతో వాసుదేవరెడ్డిని ఏపీబీసీఎల్ ఎండీ స్థానం నుంచి ఈసీ తప్పించింది. అయితే ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఏపీఎస్‌బీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి దస్త్రాలు చోరీచేసి తరలిస్తుండగా చూశానంటూ ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం మె?గులూరుకు చెందిన శివకృష్ణ పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. ఈ ఫిర్యాదు ఆధారంగా హైదరాబాద్‌లో ఆయన ఉంటున్న ఓ ఖరీదైన విల్లాలో సీఐడీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు సోదాలు నిర్వహించారు. ఇంట్లో నిర్వహించిన సోదాల్లో కీలకమైన డాక్యుమెంట్లు, ఇతర వివరాలు లభించినట్లుగా తెలుస్తోంది. వైసీపీ హయాంలో ప్రభుత్వ పెద్దలు, వైసీపీ నాయకులు, వారి సన్నిహితులు కలిసి మద్యం తయారీ, దాన్ని కొనుగోలు చేయడం, సరఫరా చేయడం, అమ్మడంలాంటివన్నీ వారి అధీనంలోనే ఉంచుకొని భారీగా దోచుకున్నారని తెలుగుదేశం పార్టీ ఆరోపిస్తోంది. జే బ్రాండ్ మద్యాన్ని అమ్మడం, దుకాణాల్లో క్యాష్ లావాదేవీల వెనుక వాసుదేవరెడ్డి హస్తం ఉందని.. అదో పెద్ద స్కామని అంటున్నారు. హైకోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించడంతో ఆయనను సీఐడీ అధికారులు ఏ క్షణమైనా అరెస్ట్ చేసే అవకాశం ఉంది.

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.com

## అమరావతి
## గుంటూరు, ఉమ్మడి కృష్ణా

# ఐదేళ్ల అరాచకాలపై సైలెంట్

## –వైకాపా తీరుపై మండిపడ్డ ఎమ్మెల్సీ అనూరాధ

అమరావతి,జూన్ 13 (సూర్య వాస్తవం): ఓటమిని అంగీకరించని వైకాపా నేతలు సాకులు వెతికే పనిలో శవరాజకీయాలు చేస్తున్నారని టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. అధికారం చేపట్టి రెండు రోజులు కాకముందే అప్పుడే అరాచకాలు అంటూ గగ్గోలు పెడుతున్నారని మండిపడ్డారు. ఐదేళ్లపాటు వైసీపీ నేతలు చేసిన అరాచకాలు, దౌర్జన్యాలు, మారణకాండకు తగిన మూల్యం చెల్లించుకున్నారని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. ప్రతిపక్ష హోదా కూడా లేకుండా ప్రజలు చిత్తుచిత్తుగా ఎందుకు ఓడించారో ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవుపలికారు. అలా చేయకుండా ఓడిపోయిన మరుసటి రోజు నుంచే శవ రాజకీయాలు మొదలుపెట్టారంటూ మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు సరిగా లేవంటూ వైసీపీ నేతలు రాష్ట్రపతిని కలవటం సిగ్గుచేటని దుయ్యబట్టారు. వైసీపీ అంటేనే శవ రాజకీయాల పార్టీ అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. సీఎం పదవి కోసం తండ్రి శవం పక్కన పెట్టుకుని సంతకాలు సేకరించింది, 2019లో బాబాయి శవాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయం చేసింది జగన్ రెడ్డి కాదా? అని ఆమె ప్రశ్నించారు. 'వైసీపీ ప్రభుత్వంలో పల్నాడులో తోట చంద్రయ్య గొంతు కోసి చంపారు. కంచర్ల జల్లయ్య యాదవ్‌ను హత్య చేశారు. దాచేపల్లిలో కాపు సామాజికవర్గానికి చెందిన పురంశెట్టి అంకుల్‌ని కిరాతకంగా హతమార్చారు. రేపల్లెలో బీసీ బాలుడు అమర్నాథ్ గౌడ్‌ను పెట్రోల్ పోసి తగలపెట్టారు. జడ్ ప్లస్ కేటగిరి ఉన్న చంద్రబాబు నాయుడు ఇంటిపై జోగి రమేశ్ దాడి చేశారు. మా పార్టీ కార్యాలయంపై దాడి చేసి సిబ్బందిని విచక్షణ రహితంగా కొట్టి గాయపరిచారు. దళిత డ్రైవర్‌ని వైసీపీ ఎమ్మెల్సీ చంపి డోర్ డెలివరీ చేశారు. కరోనా సమయంలో మాస్క్ అడిగిన పాపానికి దళిత డాక్టర్ సుధాకర్‌ను వేధించి మరీ చంపారు. ఇసుక మాఫియాని ప్రశ్నించిన చేనేత వర్గానికి చెందిన నందం సుబ్బయ్యను దారుణంగా హత్య చేశారు. ఎన్నికల రోజు తాడిపత్రి, చంద్రగిరి, మాచర్లలో దాడులు చేశారు' అని ఆమె చెప్పుకొచ్చారు. దాడులు, హత్యలు అంటే ఇవనీ.. అలాంటిది రాష్ట్రంలో శాంతిభద్రతలు సరిగా లేవంటూ వైసీపీ నేతలు రాష్ట్రపతిని కలవటంపై ఆమె మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండ్రోజులే అయ్యిందని, తమ పార్టీ నేతలు దాడులు చేస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తే 'ఖబడ్దార్' అంటూ హెచ్చరించారు. వైసీపీ నేతలు ఇప్పటికైనా శవరాజకీయాలు మానుకోవాలని ఎమ్మెల్సీ అనురాధ హితబోధ చేశారు.

# ఐదు సంతకాలతో అన్ని వర్గాలకు భద్రత, భరోసా కల్పించిన ముఖ్యమంత్రి



అమరావతి,జూన్ 13 (సూర్య వాస్తవం): రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన వెంటనే ఐదు ముఖ్యమైన ఫైళ్లపై సంతకాలు చేసి రాష్ట్రంలోని అన్ని వర్గాలకు భద్రత, భరోసా కల్పించారని రాష్ట్ర మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన నిమ్మల రామానాయుడు, డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, ఎస్.సవిత సంయుక్తంగా పేర్కొన్నారు. గురువారం సాయంత్రం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన తదుపరి పబ్లిసిటీ సెల్‌లో ఈ ముగ్గురు మంత్రులు పాత్రికేయులతో మట్లాడుతూ ముఖ్యమంత్రి తొలి ఐదు సంతకాలతో రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు, రైతులకు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు, నిరుపేదలకు భద్రత, భరోసా కల్పించారన్నారు.

# విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న సీఎం చంద్రబాబు





**నమస్తే–శ్రీతేజన్యూస్,విజయవాడ**: ఏపీ సీఎం చంద్రబాబు విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రికి చేరుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. తిరుమల పర్యటన ముగించుకొని ఇంద్రకీలాద్రికి చేరుకున్న సీఎంకు దేవాదాయ శాఖ కమిషనర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, ఆలయ ఈవో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు అదనపు సీట్లు మంజూరు

ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం): స్థానిక వై.యస్.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆఫ్ యోగి వేమన యూనివర్సిటీ 6 కోర్ బ్రాంచ్ లకు అదనంగా ప్రతి విభాగానికి 20 సీట్లచొప్పున మరియు మెటలర్జీ విభాగానికి 30 సీట్లచొప్పున మొత్తం 130 అదనపు సీట్లకు ఏఐసీటిఈ అనుమతి లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 20వ తేదీన ఏఐసీటిఈ కమిటీ వారు వర్చువల్ పద్ధతిలో కళాశాలను తనిఖీ చేసి అన్నీ మౌళిక వసతులు అనగా ఫ్యాకల్టీ, భోధనేతర సిబ్బంది, ప్రయోగశాలలు, గ్రంథాలయం, విద్యార్థుల ప్లేస్మెంట్స్ మరియు విద్యార్థుల ఉత్తీర్ణత శాతం, కళాశాల భవనాలు, కళాశాల ప్రాంగణం మొదలైనవి ఏఐసీటిఈ నిబంధనలకు లోబడి ఉన్నాయని వారు కళాశాలకు 2024-25 సంవత్సరం నుండి అదనపు సీట్లు మంజూరు చేయడం జరిగిందని వివరించారు. ఈ అదనపు సీట్లు రాబోయే విద్యసంవత్సరం 2024-25 సంవత్సరం నుండి కళాశాలలో చేరుటకు అవకాశం ఉన్నదని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు కళాశాల డీన్ ఆఫ్ ఫ్యాకల్టీ ఆచార్య కె. వి. రమణయ్య, హెచ్ఓడీలు, కళాశాల అధ్యాపకులు మరియు భోదన భోధనేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

# సమస్యలు పరిష్కరించాలని హెచ్పీసిఎల్ డ్రైవర్స్ అండ్ హెల్పర్ యూనియన్ ఆందోళన

## -దాదాపు 250, వాహనాలు నిలుపుదల



సిద్ధవటం సూర్య వాస్తవం : తమ పట్ల హెచ్పీసీఎల్ డిపో మేనేజర్ సతీష్ కుమార్ నిర్లక్ష్యం చూపుతున్నారని గురువారం సిద్ధవటం మండలం కడప చెన్నై రహదారి హెచ్పీసిఎల్ హిందుస్థాన్ పెట్రోలియం వద్ద ఆయిల్ డ్రైవర్స్ అండ్ హెల్పర్ యూనియన్ ప్రెసిడెంట్ షరీఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో వాహనాలు నిలుపుదల చేసి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా డ్రైవర్స్ యూనియన్ ప్రెసిడెంట్ షరీఫ్ హుస్సేన్ మాట్లాడుతూ హెచ్పీసిఎల్ డిపో మేనేజర్ సతీష్ కుమార్ తమ పట్ల నిర్లక్ష్య ధోరణి చూపుతున్నారన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయలేదని తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా సమస్యలు పరిష్కారం కాలేదని సాయంత్రం 4:30 నిమిషములకు ఎటువంటి ఆయిల్ రవాణా జరగకుండా డిపో క్లోజ్ చేయమంటే చేయడం లేదన్నారు. డ్రైవర్లను చాలా విధాలుగా అణగతొక్కుతూ చిన్నచూపు చూస్తున్నారని మండిపడ్డారు. విషయాన్ని తెలుసుకున్న డిఎం సతీష్ కుమార్ ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో వాహనాలు యధాతధంగా వెళ్లాయి.

# నీట్ పరీక్షా ఫలితాల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలి

- ఆర్ ఎస్ యు ఆధ్వర్యంలో క్లాక్ టవర్ వద్ద నిరసన
- ఆర్ ఎస్ యు అనంతపురం జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్..



కడప సూర్య వాస్తవం : నీట్ పరీక్ష ఫలితాలపై సమగ్ర విచారణ జరపాలని అనంతపురం జిల్లా కేంద్రం లో నగరం స్థానిక క్లాక్ టవర్ సర్కిల్లో గురువారం ఆర్ ఎస్ యు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ మాట్లాడుతూ 2024 విద్యా సంవత్సరంలో మెడికల్ విద్యను అభ్యసించడానికి జాతీయస్థాయిలో నిర్వహించినటువంటి నీట్ పరీక్ష ఫలితాలు జూన్ 4 వ తేదీన ఈ పరీక్ష ఫలితాలలో 67 మంది విద్యార్థులకి 720 కి 720 మార్కులు వచ్చి జాతీయస్థాయిలో మొదటి ర్యాంక్ రావడం దీనిలో ఏడుగురు విద్యార్థులు ఒకే సెంటర్లో ఉండడం అనేక అనుమానాలు ఉన్నాయి. జూన్ 14 విడుదల కావలసిన నీట్ పరీక్షా ఫలితాలని జూన్ 4 న దేశవ్యాప్తంగా ఎన్నికలు ఫలితాల్లో భాగంగా హడావుడిలో ఉంటే అదే రోజు విడుదల చేయడం అనుమానాలకు గురిచేస్తుంది. దీనిపైన ఇప్పటికే దేశవ్యాప్తంగా నీట్ రాసినటువంటి విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే నీట్ పరీక్షాలను నిర్వహించినటువంటి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పై సమగ్ర విచారణను సిట్టింగ్ జడ్జితో జరిపించాలని 24 లక్షల మంది మెడికల్ విద్యార్థుల భవిష్యత్తులను కాపాడాలని, మెడికల్ విద్యతో వ్యాపారాన్ని ఆపి జాతీయస్థాయిలో నీట్ పరీక్షలు రద్దు చేయాలని రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ గా మేము డిమాండ్ చేస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్ యు నాయకులు సంజు, లోకేష్, మస్తానా వలి, విజయ్, రంజిత్, దినేష్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా పోచమ్మ బోనాలు జాతర



జగిత్యాల జూన్ 13 (సూర్య వాస్తవం): జగిత్యాల పట్టణంలోని నూకపల్లి, కేసీఆర్ నగర్ లో డబల్ బెడ్ రూం ఇండ్లు ప్రజలు ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల జాతర ఘనంగా నిర్వహించారు.. ఈ సంధర్భంగా మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకొని దప్పు చప్పుళ్లతో శివసత్తుల పూనకాలతో పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకుని బోనాలు చెల్లించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు నెత్తిన బోనాలతో శివశక్తుల పూనుకలతో ఊగిపోయారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్. ఎం.సంజయ్ కుమార్ హాజరై పోచమ్మ దేవి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలకు, తమ పిల్లా పాపలను, పాడి పశువులను చల్లగా చూడాలని పోచమ్మ తల్లిని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల పట్టణంలో ఇల్లు లేని నిరుపేదలకు కోసం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీమంత్రి కేటీఆర్ ,కవితక్క సహకారంతో 300 కోట్లతో 4520 డబల్ బెడ్ రూం ఇండ్ల ను నిర్మించుకోవడం జరిగిందని తెలిపారు ... అలాగే 17 కోట్ల రూపాయలతో నీటి సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. రోడ్లు డ్రైనేజీలు కరెంటు తదితర మౌలిక వసతులు కోసం 25 కోట్ల రూపాయలను మంజూరు చేయించడం జరిగిందని, 3.5 కోట్లు కరెంట్ మరియు 8 కోట్ల వరకు 2000 ఇండ్ల సెప్టిక్ ట్యాంక్ ల పనులు నిలిచిపోయాయిని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పేదవారి కోసం టి ఆర్ నగర్ లో ఇండ్లు కేటాయించిన అభివృద్ధికి నోచుకోలేదని ,గత ఐదు ఏళ్లలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత టి ఆర్ నగర్ ను అభివృద్ధి చేశామని, బస్తి దావాఖాన ఏర్పాటు, మన ఊరు మన బస్తి కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి పనులు చేయడం జరిగిందని అన్నారు. కెసిఆర్ కాలని లో 520 ఇండ్లు కు కరెంట్ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. డ్రైనేజీ కోసం 2.5 కోట్ల తో డ్రైనేజీ,కల్వర్టు లు నిర్మించాం అని,ఇందిరమ్మ ఇండ్లుకు రోడ్డు భూదాత భూ సమస్యతో పనులు నిలిచాయని, భూదాత పేరు గత శిల పలకం లో కూడా ఉందని అన్నారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డీ చొరవ తీసుకోవాలని, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. పోచమ్మ బోనాలకు రావడం చాల ఆనందంగా ఉన్నా,ఇంకా కొన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం మా బాధ్యత అని అన్నారు. ప్రజల కోసం ఎక్కడి వరకు వెళ్లి అయినా పనులు పూర్తి చేస్తాం అని ప్రభుత్వ పక్షాన స్థానిక నాయకుల సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరారు.. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మించిన కొద్ది రోజులకే బీటలు వారిన రోడ్డు

డుంబ్రిగుడ జూన్ 13 (సూర్య వాస్తవం): మండలంలో నూతనంగా నిర్మించిన 516 ఈ హైవే రోడ్డు నిర్మించిన కొద్ది రోజులకే బీటలు వారుతుండడంతోపాటు బిల్లాపుట్టు బ్రిడ్జి వద్ద రోడ్డు దిగిపోతుండడంతో వాహనదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. బిల్లాపుట్టు, కించుమండ మధ్యలో ఇటీవల నిర్మించిన హైవే రోడ్డు బీటలు వారగా , బిల్లాపుట్టు బ్రిడ్జి వద్ద రోడ్డు దిగబడుతుంది. దీన్ని గమనించకుండా వాహనదారులు ప్రయాణిస్తూ ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉందని వాహనదారులు అంటున్నారు. నిర్మించిన కొద్ది రోజులకే రోడ్డు బీటలు వారుతుండడంతో నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని పలువురు అంటున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి

## -సిద్దవటం జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి



సిద్ధవటం సూర్య వాస్తవం :జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలని సిద్దవటం జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు గురువారం జరిగిన క్రైమ్ మీటింగ్ జరిగింది. ఈ సందర్బంగా సిద్ధవటం జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ జూన్ 29వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ నందు సివిల్ మరియు క్రిమినల్ కేసులు పరిష్కారం అవుతాయన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కేసులను పరిష్కారం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ పురుషోత్తం రాజు, మండల ఎస్సై, పెద్ద ఓబన్న, ఒంటిమిట్ట ఎస్సై మధుసుధన్ రావు, స్థానిక అడ్వకేట్స్ పాల్గొన్నారు.

# సామాజిక సేవకులకు విద్యా ప్రదాత సేవా పురస్కారం




హిందూపురం టౌన్ సూర్య వాస్తవం: హిందూపురం పట్టణం లోని ఆర్టీసీ కాలనీ లో ని ముస్లిం నగారా కార్యాలయం లో అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూక్ ఖాన్ ఆధ్వర్యంలో సత్య సాయి జిల్లా రచయితల సంఘం హిందూపురం పట్టణ అధ్యక్షులు కల్లూరు రాఘవేంద్ర రావు అధ్యక్షతన సామాజిక సేవకులకు విద్యా ప్రదాత సేవా పురస్కారం అందజేసే కార్యక్రమం ఘనంగా జరిగింది సీ.యమ్. ఆ ర్. రియల్ ఎస్టేట్ డెవలపర్స్ మల్లికార్జున మరియు చాంద్ బాషా అను సామాజిక సేవకులకు అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ వారి తరుపున ఈ పురస్కారాలను అందజేశారు చాంద్ బాషా . మల్లికార్జున సామాజిక సేవకులు గతంలో కోవిడ్ మహమ్మారి సమయం లో కోవిడ్ బాధితులను అన్ని విధాల ఆదుకొన్నారు మరియు విద్యార్థుల కు చైతన్యం చేస్తూ విద్యార్థుల ను ఆదుకొంటూ సహాయ సహకారాలు అందించినందుకు పురప్రముఖుల సమక్షంలో ఈ పురస్కారాన్ని అందజేశారు మరియు ముస్లిం మైనార్టీ విద్యా చైతన్య సదస్సు లో కొద్ది మంది విద్యార్థులు అనివార్యకారణాల వల్ల అందుబాటులో లేనందున వారికి కూడా విద్యా ప్రతిభా పురస్కారాలు అందజేశారు ఈ కార్యక్రమం లో ఉబెదుల్లా హుసేన్.లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్. అబ్దుస్సలామ్.మౌలానా రిజా ఉర్ రహమాన్. మౌలానా సాజిద్. ఆర్ ఎమ్ ఎస్ షఫీ భాయ్. షేక్ షబ్బీర్.ముస్తఫా ఖాన్. అల్ అమీన్ రియాజ్.అన్సార్.ఆడిటర్ జబీ. జహూర్. అర్షద్.తదితరులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

# ఉగ్రవాదాన్ని అరికట్టాలి



ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం): ఉగ్రవాదాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం విశ్వహిందూ పరిషత్ వివేకానంద సేవా సమితి ప్రొద్దుటూరు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9వ తేదీన జమ్మూ కాశ్మీర్లో వైష్ణవి దేవి దేవాలయం యాత్రకు వెళ్లిన భక్తులపైన ఉగ్రవాదులు దాడి చేశారని, ఈ దాడిలో దాదాపుగా పదిమంది పైన చనిపోవడం జరిగిందని వివరించారు. ఆ దాడిని ఖండిస్తూ ఇటువంటి దాడులు మళ్ళీ మళ్ళీ జరగకుండా తగిన చర్యలు తీసుకొని ఆ ఉగ్రవాదులను వెంటనే శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు మల్లికార్జున రావు, నాగార్జున, ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షులు నాగమణి రెడ్డి, బిజెపి టౌన్ అధ్యక్షుడు వంకధార నరేంద్ర రావు, జిల్లా ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి భాస్కర్ రెడ్డి, గోశాల అధ్యక్షుడు, బిజెపి ఉపాధ్యక్షుడు శివ నాగిరెడ్డి, హరికృష్ణ, రాఘవేంద్రారెడ్డి, చిన్న, శ్రీరామ సేవా సమితి నాయకుడు దశమందం బాబు మరియు బిజెపి నాయకులు మరియు విశ్వహిందూ పరిషత్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీ పై బాబు తొలి సంతకం నిరుద్యోగులకు వెలుగుల చిహ్నం



కడప , సూర్య వాస్తవం: మెగా డీఎస్సీ పై తొలి సంతకం చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు కి కృతజ్ఞతలు తెలుపుతూ కడప జిల్లా టీఎన్ఎస్ఎఫ్, నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో కడప నగరం సంధ్యా సర్కిల్ వద్ద చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేస్తానన్నా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చి అధికారం చేపట్టిన క్షణాన్నే డీఎస్సీ పై మొదటి సంతకం చేయడం పట్ల టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బొజ్జ తిరుమలేష్, ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డి. ఎం. ఓబులేసు యాదవ్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాటి అమర్నాథ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బొజ్జ తిరుమలేష్, ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డి. ఎం. ఓబులేసు యాదవ్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాటి అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు 2024 ఎన్నికల హామీల్లో భాగంగా మొదటి సంతకం డీఎస్సీ ఉద్యోగాలపై చేస్తాను అని ఇచ్చిన మాట ప్రకారం బాధ్యతలు తీసుకున్న మరుక్షణమే రాష్ట్రంలో మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేసేందుకు మెగా డీఎస్సీ ఫైల్ పై సంతకం చేయడం శుభపరిణామం అన్నారు. గడిచిన 5 సంవత్సరాల కాలంలో జగన్ నిరుద్యోగ యువతను మోసాగించారని చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకునే నైజం ఉన్న నాయకుడని కొనియాడారు. చంద్రబాబు నేతృత్వంలో విద్యార్థులకు యువతకు దిశా నిర్దేశం చేయగలిగిన ఒక విజన్ ఉన్న నాయకుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, టిడిపి నాయకులు, జఫన్యా విద్యాసంస్థల అధినేత పండిట్ దేవిడ్, జిల్లా కార్యదర్శి పోలిరెడ్డి, అఫ్జల్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు లోకేష్, ఫరీద్, మహేష్, నవీన్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ గురించి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

సిద్దిపేట జూన్ 13 (సూర్య వాస్తవం): పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం ట్రాఫిక్ ఏసిపి సుమన్ కుమార్, సిద్దిపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, ఎస్ఐ వినయ్ సాగర్ మరియు సిబ్బందితో కలిసి సిద్దిపేట పట్టణం రాజీవ్ రహదారి పరిసర ప్రాంతాలలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి చనిపోవడం జరుగుతున్న బ్లాక్ స్పాట్స్ : కుంకుమ మిల్లు చౌరస్తా, రంగీలా దాబా చౌరస్తా, రాజీవ్ రహదారి సిఏఆర్ హెడ్ క్వార్టర్ చౌరస్తా, సిరిసిల్ల రోడ్డు రేణుక ఎల్లమ్మ టెంపుల్ చౌరస్తా, ఓల్డ్ బస్టాండ్ అంబేద్కర్ చౌరస్తా ప్రదేశాలను సందర్శించారు. ప్రమాదాల నివారణ గురించి తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్త చర్యలు తదితర అంశాల గురించి పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ సుమన్ కుమార్ మాట్లాడుతూ. ప్రమాదాల నివారణ గురించి త్వరలో ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మరియు సైన్ బోర్డులు రంబుల్ స్ట్రిప్స్, హెచ్చరిక సిగ్నల్స్ రంబుల్ స్ట్రిప్స్, ఇల్యూమినేషన్ టవర్లు, ఏర్పాటు చేయడం గురించి పోలీస్ కమిషనర్ ద్వారా ఆర్ అండ్ బి మరియు హెచ్ కే ఆర్ డిపార్ట్మెంట్కు నివేదికలు పంపిస్తామని తెలిపారు. త్వరలో పనులు పూర్తయ్యాలా కృషి చేస్తామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి ప్రతి వాహనదారుడు రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు.

# ముడుపులు ఇచ్చుకో పర్మిషన్లు తీసుకో

## అనంతపురం నగరంలో విచ్చలవిడిగా విద్యాసంస్థలకు అనుమతులు మంజూరు చేసిన డిప్యూటీ డిఈఓ శ్రీనివాసరావును సస్పెండ్ చేయాలి



అనంతపురం క్రైం ( సూర్య వాస్తవం) : అనంతపురం నగర పరిధిలో అపార్ట్మెంట్లలో మరియు బిల్డింగ్ నిర్మాణంలో ఉన్న విచ్చలవిడిగా అనుమతులు మంజూరు చేసిన డిప్యూటీ డిఈఓ శ్రీనివాసరావును విధులనుంచి తొలగించాలని ఏఐఎస్ఎఫ్ ఎన్ఎస్యుఐ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి ఎన్ఎస్యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎనుముల నరేష్ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రమణయ్య ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు ఓబులేసు మాట్లాడుతూ అనంతపురం నగరంలో కార్పొరేట్ విద్యాసంస్థలు కాసులు ఇచ్చుకో అనుమతులు తీసుకో అన్నట్టు జిల్లా డిప్యూటీ డిఇఓ శ్రీనివాసరావు గారు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అపార్ట్మెంట్లో మరియు నిర్మాణంలో ఉన్న వాటికి విద్యాసంస్థల పర్మిషన్ ఎలా మంజూరు జారీ చేస్తారని పేర్కొన్నారు.. ముడుపులు ఇచ్చుకో కార్పొరేట్ విద్యాసంస్థలకు వత్తాసుగా రిపోర్ట్ రాసుకో అన్న పద్ధతుల్లో డిప్యూటీ డిఈఓ వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. నాలుగవ రోడ్డులో ఉన్న అపార్ట్మెంట్లో నడుపుతున్న భాష్యం స్కూల్ కి ఏ విధంగా అనుమతి మంజూరు చేశారని పేర్కొన్నారు.. అదేవిధంగా ఎడిఫై వరల్డ్ స్కూల్ కు జిల్లా విద్యాశాఖ అధికారులు అనుమతిని రిజెక్ట్ చేసినప్పటికీ పై అధికారులు ఎలా అనుమతి మంజూరు చేశారని ప్రశ్నించారు.. నగరంలో కార్పొరేట్ విద్యాసంస్థలు పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్ముతున్నారని ప్రత్యక్షంగా ఆధారాలతో సహా డిప్యూటీ డిఈఓకి ఎంఈఓ కి వీడియో క్లిప్పింగ్ లతో సహా అందజేసిన కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోకుండా కనీసం వారికి నోటీసులు గాని ఫైన్లు గాని వేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారి డీఈవో స్పందించి తన పదవి కాలంలో విచ్చలవిడిగా నగరంలో పర్మిషన్లు మంజూరు చేసిన డిప్యూటీ డిఈఓ పైన సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నిబంధనలు తుంగలో తొక్కుతూ పాఠశాల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్ముతున్న కార్పొరేట్ విద్యాసంస్థలను తనిఖీ చేసి వాటిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి హనుమంతు నగర అధ్యక్ష కార్యదర్శులు మంజునాథ్ ఉమా మహేష్ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ నగర నాయకులు హరికృష్ణ హర్ష సమీర్ రారాజు ఎన్ ఎస్ యు ఐ నాయకులు హర్షద్ సాయి కార్తీక్ తదితరులు పాల్గొన్నారులి

# మున్సిపాలిటీ దిన కూలీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

## –ఎస్సీ మున్సిపల్ వర్కర్స్ అసోసియేషన్ వినతి





అనంతపురం క్రైం ( సూర్య వాస్తవం) : అనంతపురం మున్సిపాలిటీలో పనిచేస్తూ పది సంవత్సరాల నుండి దిన కూలీలుగా పని చేస్తూ ఉద్యోగ భద్రత లేని మలేరియా, కోవిడ్, మినీ జెసిపి డ్రైవర్లు, ఆఫీసు పరిధిలో పనిచేస్తున్న డ్రైవర్లకు ఉద్యోగ భద్రత లేకుండానే జీతాలు ఇస్తున్నారని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఎస్సీ మున్సిపల్ వర్కర్స్ అసోసియేషన్ గురువారం నాడు మున్సిపల్ కమిషనర్ మేఘ స్వరూప్ కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ స్థాయి విస్తీర్ణత పెరిగిన కారణంగా కొత్త వర్కర్లను తీసుకుని సందర్భంలో ఎస్సీ వర్కర్స్ అసోసియేషన్ సభ్యులకు కూడ ప్రాధాన్యత కల్పించాలని అనంతపురం మున్సిపల్ కమిషనర్ మేఘస్వరూప్, అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, మేయర్, డిప్యూటీ మేయర్లకు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మున్సిపల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అజయ్ బాబు, ఎస్సీ మున్సిపల్ వర్కర్స్ అసోసియేషన్ న్యాయ సలహాదారులు తిరుపాల్, ఎస్సీ మున్సిపల్ వర్కర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జూటూరి పెద్దన్న, వెంకట నరసయ్య, కే.ఆర్ సురేష్ , ఏం .ఓబులేసు, బి పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి

## – జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి



అనంతపురం క్రైం (సూర్య వాస్తవం): జిల్లాలో బాల్య వివాహాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. ఆదేశించారు. గురువారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా బాలల పరిరక్షణ సమితి మరియు చైల్డ్ హెల్ప్ లైన్ అధికారులు, సిబ్బంది (ఐసిడిఎస్ శాఖ)తో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు సంబంధించిన చట్టాలను అమలు చేయడంలో డిసిపియు మరియు చైల్డ్ హెల్ప్ లైన్ విభాగము వారు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలు, చైల్డ్ లేబర్ ఉన్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. బాల్యవివాహాలకు సంబంధించి సమాచారం వచ్చిన వెంటనే సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి బాల్య వివాహాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, చైల్డ్ మ్యారేజ్ కేసు పెట్టాలని సూచించారు. జువైనల్ జస్టిస్, ఫోక్సో, పిసిపిఎన్డిటి, రైట్ టు ఎడ్యుకేషన్, తలాక్ సిస్టం, లాంటి ఎనిమిది రకాల చట్టాల గురించి అవగాహన ఉండాలని, ఒక్కో సబ్జెక్టును ఒక అధికారికి కేటాయించాలన్నారు. ప్రతి చట్టం గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఐఈసి యాక్టివిటీలను చిత్తశుద్ధితో నిర్వహించాలని, మారుమూల మండలాలైన బొమ్మనహాల్, డి.హీరేహాల్, పెదపప్పురు, యల్లనూరు మండలాల్లో పర్యటించాలని, సీజన్ బట్టి కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలన్నారు.ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఐసిడిఎస్ పిడి బి.ఎన్.శ్రీదేవి, జిల్లా బాలల పరిరక్షణ సమితి అధికారి మంజునాథ్, ప్రొటెక్షన్ ఆఫీసర్స్ వెంకటేశ్వరి, సంధ్య, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ కృష్ణమాచారి, డిసిపిఓ సిబ్బంది వసంత, సంధ్య, వెంకట కుమార్, రమాదేవి, కమలాక్షి, సమీర్, రామాంజనమ్మ, చైల్డ్ లైన్ సిబ్బంది సురేష్, ఇర్ఫాన్, సుహాసిని, నిర్మల, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

**ఆర్.అండ్.బి శాఖపై సమీక్ష :**

అంతకుముందు ఆర్.అండ్.బి శాఖపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆర్.అండ్.బి పరిధిలో రహదారులు ఎన్ని కిలోమీటర్లు ఉన్నాయి, మరమ్మత్తుల వివరాలు, పనుల పురోగతి ఎంతమంది అధికారులు, సిబ్బంది ఉన్నారు, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించడం జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రహదారుల యాన్యువల్ మెయింటెనెన్స్ కు సంబంధించి ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. రహదారులు, భవనాల నిర్మాణం పురోగతిపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఈఈ రాజగోపాల్, వెంకటరమణ, డీఈలు బాలకాటమయ్య, శ్రీధర్ రెడ్డి, సురేష్ నాయక్, రవిశంకర్ రెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

# శానిటేషన్ పై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం

## వర్షపు నీరు ఎక్కడ నిలువ ఉండకుండా చర్యలు చేపట్టాలి : మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి



పులివెందుల అర్బన్ , సూర్య వాస్తవం: పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో శానిటేషన్ పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని, అదేవిధంగా పులివెందుల పట్టణ పరిధిలో లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలువ ఉండకుండా మున్సిపల్ సిబ్బంది చర్యలు చేపట్టాలని కమిషనర్ రమణారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని యర్రగుడి పల్లె నందు పర్యటించారు.భూగర్భ డ్రైనేజీ మరియు మంచి నీటి సరఫరా గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు.శానిటేషన్ గురించి ప్రజలకు తెలిపి వారికి అవగాహన కల్పించాలన్నారు ప్రజలు ఎక్కడ కూడా ఖాళీ స్థలాల్లో వేయకుండా మున్సిపల్ వాహనానికి అందించవలెను వారికి తెలియజేస్తున్నారు అంతేగాకుండా శానిటేషన్ పై స్పెషల్ డ్రైవ్ చేయాలని సూచించారు. మరియు వర్షాలు పడుతున్నందున లోతట్టు ప్రాంతాల యందు ఎక్కడ నీరు నిలవకుండా చూడవలెనని తెలిపి ఉన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్ కుమార్,మున్సిపల్ ఏ, ఇ, ఎక్నాథ్ , సానిటరీ ఇన్స్పెక్టర్ టి మురళీధర్ మరియు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

Truth of News సూర్య http://www.suryavastavam.com వాస్తవం

# రాయలసీమ

## కడప, అనంతపురం, చిత్తూరు

# హింసాత్మక ఘటనలకు పాల్పడితే చర్యలు

## –కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు



అనంతపురం క్రైం ( సూర్య వాస్తవం) : హింసాత్మక ఘటనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ గౌతమిసాలి ఆదేశాల మేరకు కళ్యాణదుర్గం మండలం ఒంటిమిద్దె గ్రామంలో కేంద్ర సాయుధ బలగాలచే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన రహదారి మరియు కాలనీలలో కవాతు కొనసాగింది. అనంతరం... గ్రామస్తులతో మాట్లాడారు. అల్లర్లు, గొడవలు జోలికెళ్లి కేసుల్లో ఇరుక్కుపోవద్దని సూచించారు. ముఖ్యంగా యువత సంయనంతో ఉండాలని... కేసుల్లో ఇరుక్కుపోతే భవిష్యత్తు నాశనమవుతుందని తెలియజేశారు. ఈకార్యక్రమంలో సి.ఐ హరినాథ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాలలో ప్రశాంతత లోపించకుండా ముందస్తు చర్యలు చేపట్టండి : జిల్లా ఎస్పీ గౌతమిసా



అనంతపురం క్రైం ( సూర్య వాస్తవం) : గ్రామాలలో ప్రశాంతత లోపించకుండా... శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ గౌతమిసాలి ఆదేశించారు. ఉరవకొండ పోలీసు స్టేషన్లో పోలీసు అధికారులతో సమావేశమై తాజా పరిస్థితులను సమీక్షించారు. సమస్యాత్మక గ్రామాలు, కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తరుచూ సందర్శించడమే కాకుండా నిరంతరం మొబైల్ పార్టీలచే పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. ఇంకా అవసరమనుకుంటే పికెట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరైనా అల్లర్లు, విధ్వంసాలకు పాల్పడితే చట్టపరంగా గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడా శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా పని చేయాలన్నారు. ఈసమావేశంలో గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్ రెడ్డి, సి.ఐ సురేష్ బాబు, ఎస్సై రాఘువేంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

# బిసి జనార్ధన్ ను కలిసిన

## తెదేపా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి



నందలూరు, సూర్య వాస్తవం: నూతనంగా ప్రమాణ స్వీకారం చేసి మంత్రి బాధ్యతలు చేపట్టిన బనగానపల్లె టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ జనార్ధన్ రెడ్డి ని మర్యాదపూర్వంగా కలిసి పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేసిన తెదేపా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయ శేఖర్ రెడ్డి ఆయన వెంట లేబాక గ్రామ సర్పంచ్ వంకాయ వెంకట నరసయ్య . రాజంపేట తెలుగు యువత అధ్యక్షులు రాము యాదవ్. టిడిపి నాయకులు మండల మాజీ అధ్యక్షులు మరియు ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ భువన బోయిన లక్ష్మీ నరసయ్య. రాజంపేట ఎమ్మార్పీఎస్ నాయకులు సాతుపల్లి వెంకటేష్. నందలూరు మండల మాజీ నీటి సంఘం అధ్యక్షులు చుక్కా కొండయ్య. తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉపాధ్యాయుడు దారుణ హత్య

తిరుపతి, సూర్య వాస్తవం: న్నమయ్య జిల్లా మదనపల్లెలో గురువారం తెల్లవారు జామున ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు దారుణ హత్యకు గురయ్యాడు. పట్టణంలోని ఎగువకురవంకకు చెందిన టీచర్ దొరస్వామిని గుర్తు తెలియని దుండగులు దారుణంగా హతమార్చారు. ఆయన దిగువ కురవంకలోని ప్రాథమికోన్నత పాఠశాలలో దొరస్వామి ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. కురవంక పార్క్ వద్ద ఆంజనేయ గుడికి సమీపంలో ఇంట్లోని మిద్దెపై ఈ హత్య జరిగింది. మృతుని భార్య కొన్నేళ్ల క్రితం మృతి చెందగా.. ఆయన కుమార్తె హరితతో కలిసి ఉంటున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆయన తలపై ఎవరో బలంగా కొట్టడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, సీఐ వలీబ్ బసు వివరాలు సేకరించారు. ఎవరో పథకం ప్రకారం దొరస్వామిని దారుణంగా హత్య చేసినట్లు.. మృతదేహం పడి ఉన్న తీరును బట్టి పోలీసులు భావిస్తున్నారు. హత్య జరిగిన సమయంలో ఆయన కుమార్తె ఇంట్లోనే ఉండడంతో ఆమెను విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మహిళల అభ్యున్నతికి పాటుపడుతాం

## వ్యాలీ గ్రీన్ గార్మెంట్ అధినేత్రి పెరుమాళ్ళ మమతారెడ్డి



గుంతకల్లు ప్రతినిధి సూర్య వాస్తవం : అంతర్జాతీయ టైలర్ దినోత్సవం సందర్భంగా గుంతకల్లు నియోజకవర్గం పామిడి మండల పరిధిలో గజనం పల్లి గ్రామంలో ఉన్నటువంటి.. వ్యలి గ్రీన్ గార్మెంట్. నందు గురువారం టిడిపి సీనియర్ నాయకులు పెరుమాళ్ళ జీవానంద రెడ్డి మహిళల అభ్యున్నతికి పాటుపడుతాం కట్టుకున్న బట్ట వెనుక జడ్జి నైపుణ్యం ఉంటుంది ఆ నైపుణ్యం కనిపించేలా చేసేది కుట్టు మిషన్ జాతీయ కుట్టు మిషన్ దినోత్సవం అని వ్యాలీ గ్రీన్ గార్మెంట్ అధినేత్రి పెరుమాళ్ళ మమతారెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పీజేఆర్ సోషల్ సర్వీసెస్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు పెరుమాళ్ళ జీవానంద రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గన్నవరం నియోజక వర్గంలోని కేసరపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు సీఎం ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొని అక్కడనుండి బయలుదేరి గురువారం గజరాంపల్లి గ్రామం నందు వ్యాలీ గ్రీన్ గార్మెంట్ పరిశ్రమలో అంతర్జాతీయ కుట్టు మిషన్ దినోత్సవం జరుపుకున్నామన్నారు. మహిళల అభివృద్ధికి పాటుపడుతామన్నారు. వ్యాలీ గ్రీన్ గార్మెంట్ పరిశ్రమలో 2000 మందికి ఉపాధి కల్పిస్తున్నామని ప్రస్తుతం 350 మంది పనిచేస్తున్నారన్నారు. వ్యాలీ గ్రీన్ గార్మెంట్ పరిశ్రమలో ఉద్యోగం కావాలనుకున్నవారు 6304237701, 9888539999 ఈ నెంబర్ ని సంప్రదించాలని తెలియజేశారు.

# అగమ్య గోచరంగా మారిన వాలంటీర్ల భవిష్యత్తు



ఖాజీపేట, సూర్య వాస్తవం: రాజీనామా చేసిన వాలంటీర్లకు వేతనాలు లేక, మరొక ఉపాధి లేక అవస్థలు వారి పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. వివరాల్లోకి వెళితే .సార్వత్రిక ఎన్నికల సమయంలో స్వచ్ఛందంగా నైతేనో లేక ఆ పార్టీ నాయకులు బెదిరించడం వలనో వాలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామా చేసిన వాలంటీర్లు స్వచ్ఛందంగా కొందరు స్థానిక నాయకులు బలవంతం పై కొందరు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మే నెలలో రాజీనామా చేసిన వాలంటీర్లకు కొంత నగదు ముట్టజెప్పి జగన్‌కు ఓటు వేయాలని వారితో ఇంటింటికీ ప్రచారం చేయించారు. మన ప్రభుత్వమే వస్తుంది కాబట్టి మీకు మంచి భవిష్యత్తు కల్పిస్తామని చెప్పిన నాయకులు పార్టీ ఓడిపోయాక వీరిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. వై.ఎస్.ఆర్.సి.పి పార్టీని నమ్ముకున్న మా భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని వాలంటీర్లు గగ్గోలు పెడుతున్నారు. అయితే ఎన్నికల సమయంలో పవన్ కళ్యాణ్ మరియు చంద్రబాబునాయుడు తమను పలుమార్లు హెచ్చరించారని, మిమ్మల్ని తొలగించబోమని, అధికారంలోకి రాగానే రూ. 10 వేల రూపాయల వేతనంతోపాటు ఆర్థికంగా నిలదొక్కుకునేలా మంచి భవిష్యత్తు కల్పిస్తామన్నారు. స్వచ్ఛందంగా ఉండిపోవాలని మొత్తుకున్నా తామే వినలేదని కొందరు వాలంటీర్లు పశ్చాత్తాప పడుతున్నారు. కూటమి అధికారంలోకి రావడంతో రాజీనామా చేసిన వాలంటీర్లను మళ్లీ విధుల్లోకి తీసుకునే అవకాశం లేదు. పవన్ మరియు చంద్రబాబు మాట విని రాజీనామా చేయకుండా ఉండిపోయిన వాలంటీర్లు నేడు హుందాగా తలెత్తుకునే స్థితిలో ఉన్నారని, కూటమి ప్రభుత్వం రాకతో ఈ వ్యవస్థ కొత్తరూపు సంతరించుకోవచ్చని కాబట్టి మా అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని మాకు మరొక అవకాశం ఇవ్వాలని కొంతమంది వాలంటీర్లు ప్రభుత్వాన్ని కోరు తున్నారు. కొత్తగా తీసుకొనే వాలంటీర్లకు బదులుగా అనుభవం అర్హత ఉన్న వాలంటీర్లకు మరొక అవకాశం కల్పిస్తే బావుంటుందని పలువురు విశ్లేషకులు ప్రజలు కోరుకుంటున్నారు.

# ప్రజలందరికీ మెరుగైన వైద్యం



దువ్వూరు,సూర్య వాస్తవం :గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ప్రభుత్వ ప్రాథమిక వైద్యాధికారిని డాక్టర్ షేక్ రోషిణి పేర్కొన్నారు. దువ్వూరు మండలానికి చెందిన 104 వాహనం ద్వారా మండ లం లోని ప్రజలకు మెరుగైన వైద్యం అందుతూ వుండటంతో ప్ర జలలో విశేష స్పందన లభిస్తుంది. ముఖ్యంగా మండలంలోని ప్రతి గ్రామంలో రోజుకొక ఊరు చొప్పున వుదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నెలలో మొత్తం 26 రోజులు గ్రామాలకు వెళుతూ సాధారణ రోగాల నుండి మధు మేహం,బ్లడ్ ప్రెషర్,క్షయ,కుష్టు, మలేరియా, డెంగ్యూ, టైపా యిడ్, తదితర రోగాలకు అవగాహన కల్పించడమే కాకుండా ఆయా రోగాలకు మెరుగైన మందులను అందిస్తూ, అలాగే గర్భిణీ స్త్రీలకు ఎత్తు, బరువు కొలతలతో పాటు రక్త శాతాన్ని వివరించి తల్లికి మందులను అందించడమే కాక, బిడ్డ ఎదుగు దలకు కావలసిన పౌష్టిక ఆహారం గురించి అవగాహన కల్పిస్తూ,బిడ్డ పుట్టినప్పటి నుంచి ఎటువంటి రోగాలు బిడ్డకు దరి చేరకుండా సరైన సమయంలో బిడ్డకు టీకాలను అందిస్తూ, ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేసే సుఖ ప్రసవం గురించి తెలుపుతూ, ప్రభుత్వం ద్వారా ప్రభుత్వ వైద్యశాలల్లో అందిస్తున్న రవాణా సౌకర్యం, అత్యవసర చికిత్స మరియు దీర్ఘ కాలిక రోగులకు ప్రభుత్వం ద్వారా ఇచ్చే ఆర్థిక సహాయాన్ని ప్రతి ఒక్కరికీ వివరిస్తూ, ముఖ్యంగా గుండె జబ్బులకు సంభందించిన వారికి 104 వాహనంలో ఈసీజీ మరియు కొన్ని రకాల మందులు అంది స్తూ, మంచంలో నుండి లేచి నడవలేని దీర్ఘ కాలిక, మరియు యాక్సిడెంటల్ కేసులను పరిశీలించి వారికి ఇంటి దగ్గరే టెస్టులుచేసి సరైన మందులను అందించడంతో ప్రజలలో ఆనందం వెల్లువిరియడమే కాక 104 వాహనం ద్వారా అందించే సేవలు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గురువారం మండలంలోని చిన్నసింగనపల్లె గ్రామములో 104 వాహనం ద్వారా ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా డాక్టర్ షేక్ రోషిణి గ్రామానికి విచ్చేసి ఫ్యామిలీ కాన్సెప్ట్ విధానాన్ని పరిశీలిస్తూ ఈ ఫ్యామిలీ కాన్సెప్ట్ విధానం ద్వారా దాదాపు 14 రకాల పరీక్షలు 65 రకాల మందులను అందించడం జరుగుతుందని ప్రభుత్వం అందిం చే అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ ఎన్ శాంతకుమారి, సిహెచ్ఓ హరి చందన, ఏఎన్ఎం తులసి కుమారి ,104 డీఈవో రామచంద్రారెడ్డి, 104 ఆపరేషన్ హెల్త్ అసిస్టెంట్ వై. పి. వెంకటరెడ్డి, ఆశ కార్యకర్త అరుణ, గ్రామస్తులు గర్భవ తులు, బాలింతలు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీతోనే మైనార్టీలకు పెద్ద పీట

**-రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధషేక్.మహబూబ్ భాషా**

పులివెందుల అర్బన్, సూర్య వాస్తవం: తెలుగుదేశం పార్టీతోనే మైనార్టీలకు పెద్దపీట దక్కుతుందని రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి మహబూబ్ బాషా పేర్కొన్నారు. వాటిలో భాగంగా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పులివెందుల పట్టణ మైనార్టీ యువకులు రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి అయినటువంటి షేక్.మహబూబ్ భాషాని ఆయన స్వగృహం నందు కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువా మరియు పూల మలతో ఆయన్ను సత్కరించడం జరిగింది. తెలుగుదేశం పార్టీతోనే మైనార్టీలకు పెద్ద పీట అని రాబోవు రోజుల్లో మైనార్టీలకు ఎన్డీఏ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేసి మైనార్టీలను ముందుకు నడిపే విధంగా కృషి చేయాలని యువకులు మహబూబ్ భాషా గారిని కొరడం జరిగింది.కార్యక్రమంలో షేక్.సమద్,ఖాదర్,ఆటో భాషా,షరీఫ్,జిలాన్, నాగ,చాందు,నజీర్,గౌస్ మరి కొంత మంది మైనార్టీ యువకులు పాల్గొనడం జరిగింది.



# క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలి

ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం): క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలని డిసిహెచ్ఎస్ డాక్టర్ హిమాదేవి, ఉప జిల్లా వైద్య మరియు శాఖధికారి డాక్టర్ శాంతికళ మరియు సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ బాబు అన్నారు. గురువారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నందు వైద్యాధికారులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, ఏఎన్ఎం లకు కాన్సర్ స్క్రీనింగ్ శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం దేశ వ్యాప్తంగా కాన్సర్ కేసులు ఎక్కువగా వస్తున్నందున పైన తెలిపిన సిబ్బందికి కాన్సర్ స్క్రీనింగ్ గురించి శిక్షణ ఇచ్చిన తర్వాత వారు క్షేత్ర స్థాయిలో కాన్సర్ గురించి అవగాహన కల్పించి ప్రాథమిక దశలోనే గుర్తించేలా స్క్రీనింగ్ చేస్తారని, కావున ప్రజలందరూ వారి జీవిత విధానం మార్చుకొని మంచి ఆహారం తీసుకొని మీకు ఏదైనా ఆరోగ్య సమస్యలు వుంటే వెంటనే దగ్గరిలోని ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకొని కాన్సర్ వ్యాధి రాకుండా జాగ్రత పడాలని అలాగే కాన్సర్ వచ్చిన వారు తగిన చికిత్స తీసుకొని ఆరోగ్యంగా వుండాలని చెప్పారు. ఈ కార్యక్రమం లో రిశోర్స్ పర్సన్స్ డా మీనా కుమారి,డా మంజుల, వెంకటరమణ పాల్గొన్నారు.




# ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి నిర్మూలన టీకాలు వేయించుకోవాలి



దువ్వూరు,సూర్య వాస్తవం : మండలంలో ప్రతి గురువారము 18 సంవత్సరాల నుంచి 80 సంవత్సరాల వారికి క్షయ వ్యాధి నిర్మూలన టీకాలను వేస్తున్నట్లు అందుకు ప్రతి ఒక్కరు టీకాలు వేయించుకోవాలని మండల ప్రభుత్వ ప్రాథమిక వైద్యాధికారిని డాక్టర్ షేక్ రోషిణి పేర్కొన్నారు .దువ్వూరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ల ఆధ్వర్యములో షుగర్ హైపరటెన్షన్ మరియు 18 నుంచి 80 సంవత్సరాల వయసు వారికీ క్షయ వ్యాధి నిర్మలన టీకాలు వేశారు.గురువారం మండల పరిధిలోని చిన్నసింగనపల్లె గ్రామములో కూడా టీకాలు వేసే క్యాంపునిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ షేక్. రోషిణి పాల్గొని మాట్లాడుతూ ఈ టీకాలు వేయించుకోవడం వలన భవిష్యత్తులో టీబీ వంటి జబ్బులు రాకుండా కాపాడుతాయని తెలిపారు . చిన్న సింగపల్లె గ్రామంలో 70 మందికి పైగా టీకాలు వేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ శాంత కుమారి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హరి చందన, ఏఎన్ఎం తులసి కుమారి, హెల్త్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల పై శిక్షణ కార్యక్రమం




పులివెందుల ప్రతినిధి సూర్య వాస్తవం: పులివెందుల, డాక్టర్ వైయస్ఆర్ సర్వజన ఆసుపత్రి ఆవరణలో సామాజిక వైద్యశాస్త్ర విభాగము, ప్రభుత్వ వైద్య కళాశాల పులివెందుల మరియు జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై పులివెందుల ప్రాంత ప్రాథమిక, పట్టణ ప్రాథమిక వైద్యాశాల ల ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్, సి హెచ్ ఓ, ఏ ఎన్ ఎం లకు 3 రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమంను గురువారం డాక్టర్ వైయస్ఆర్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీదేవి,సర్వజన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి, డాక్టర్ విఘ్నేష్, జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాజా మొయిద్దీన్, ప్రొఫెసర్ డాక్టర్ వరలక్ష్మి,సోషల్ ప్రివేంటివ్ మెడిసిన్ హెచ్ ఓ డి డాక్టర్ శంకర్ రెడ్డి లు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాణాంతక కాన్సర్ బారిన పడిన పడకుండా ప్రజలను కాపాడాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని, ఏఎన్ఎం, సిహెచ్ఓలకు క్యాన్సర్ త్వరితగతిన కనుగొనడానికి గల మెళుకువలను అనుభవజ్ఞులు అయిన వైద్యులచే శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డా నటేష్, నోడల్ ఆఫీసర్ డా కేశవ కుమార్ , ఆర్బిఎసకె ఆఫీసర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



గుంతకల్లు , సూర్యా వాస్తవం: ఉమ్మడి అనంతపురం జిల్లా శాసనమండలి సభ్యులు శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై శివరామిరెడ్డి గురువారం నాడు విజయవాడలో మాజీ ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహన్ రెడ్డి ని ఆయన క్యాంపు కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎలక్షన్లలో జరిగిన పరిణామాలు,ఫలితాలపై కులంకషంగా చర్చించారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తను కలుపుకొని రాబోయే రోజుల్లో సర్ కాంగ్రెస్ పార్టీ కోసం మనమందరం కలిసికట్టుగా పని చేయాలి ఎందుకంటే గతంలో కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపించినప్పుడు కేవలం నేను మా అమ్మ మాత్రమే ఉన్నాము నాకోసం పదిమంది ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రజలు దీవెనలతో మరల కోసం ఈ ముందుకు వస్తానన్నారు.కార్యకర్తలందరూ అధైర్య పడకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జగన్మోహన్ రెడ్డి శివరామిరెడ్డి కి సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు తిప్పారెడ్డి,దిద్దేకుంట సూరి నగేష్ ,తదితరులు పాల్గొన్నారు.

# చిరుత పులి దాడి

కర్నూలు సూర్యా వాస్తవం: మహానంది మండలం గాజులపల్లె చలమ శివారులో రైల్వే కూలీలపై చిరుత పులి పిల్ల దాడి చేసింది. ఛత్తీస్ ఘడ్ కు చెందిన పాండవ్ అనే మహిళపై చిరుత విచక్షణ రహితంగా దాడి చేయడంతో మహిళ తీవ్ర గాయాలయ్యాయి. ఆమె గాయాల పాలయింది.చలమా సమీపంలో ఛత్తీస్ ఘడ్ కు చెందిన 20 మంది రైల్వే కూలీలు పనులు చేస్తున్నారు.


# సినిమా

## సంయుక్త మీనన్ ఇండస్ట్రీలో టాపర్..



సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్‌గా కెరీర్ సాగించడం అంత ఈజీ టాస్క్ కాదు. ఆనపకాయ అంత టాలెంట్‌తో పాటు ఆవగింజ అంత అదృష్టం కూడా ఉండాలి. అందం, అభినయం ఉన్నా.. కొందరికి అవకాశాలు పెద్దగా రావు. కానీ మీరు పైన ఫోటోలో చూస్తున్న అమ్మాయి మాత్రం అందుకు మినహాయింపు. తెలుగునాట అడుగుపెట్టడమే.. మంచి హీరో సినిమాతో అరంగేట్రం చేసి మంచి విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత వరుసగా విజయాలు నమోదు చేసింది. ఇంతకీ ఈ బ్యూటీ కేరళకు చెందనది. ఏమైనా ఐడియా వచ్చిందా. ప్రస్తుతం స్టార్ హీరోయిన్‌గా టర్న్ అవుతున్న ఈమె.. మరెవరో కాదు సంయుక్త మీనన్. యూత్‌లో ఈమెకు మస్త్ క్రేజ్ ఉన్న విషయం తెలిసిందే. మొదటిగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన భీమ్లా నాయక్ మూవీతో సెకండ్ హీరోయిన్?గా టాలీవుడ్‌కు పరిచయమైంది సంయుక్త. ఆ తర్వాత కల్యాణ్ రామ్ నటించిన బింబిసార, సాయి ధరమ్ తేజ్ సరసన విరూపాక్ష, ధనుష్ జోడిగా సార్ చిత్రాలతో వరస హిట్స్ అందుకుంది. దీంతో వరుస హిట్స్ అందుకుంటూ గోల్డెన్ హీరోయిన్ అన్న నేమ్ సంపాదించుకుంది. తాజాగా సంయుక్త అందమైన క్షణాలను మిస్ అవుతున్నాను అంటూ స్కూల్ డేస్ ఫోటో షేర్ చేసింది. కాగా, ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట తెగ ట్రెండ్ అవుతోంది. అయితే పాఠశాలలో చదువుతున్న రోజుల్లో సంయుక్త స్కూల్ టాపర్ అట. ఇక విషయం తెలిసి మా హీరోయిన్ మల్టీ టాలెంటెడ్ అని కామెంట్స్ పెడుతున్నారు అభిమానులు. అయితే చివరిగా ఈమె కళ్యాణ్ రామ్ సరసన డెవిల్ చిత్రంలో కనిపించింది సంయుక్త. ఇటీవల వచ్చి లవ్ మీ చిత్రంలో కామియో రోల్ చేసింది. ప్రస్తుతం నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న స్వయంభూ సినిమాలో నటిస్తుంది. సంయుక్త స్వయంగా గుర్రపు స్వారీ కూడా నేర్చుకుంది. అటు మలయాళం, తమిళ ఇండస్ట్రీలలో కూడా అడపా దడపా సినిమాలు చేస్తూనే ఉంది. మహారాగ్ని సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ కూడా ఇవ్వబోతుంది. మరి ఈ బ్యూటీ అక్కడ కూడా గోల్డెన్ లెగ్ అనిపించుకుంటుందో లేదో చూడాలి.

## దేవర షూటింగ్ పై లేటెస్ట్ అప్డేట్..



టాలీవుడ్ ఇండస్ట్రీలో ఈ ఏడాది అత్యధిక అంచనాలు ఉన్న చిత్రాల్లో దేవర ఒకటి. ట్రిపుల్ ఆర్ తర్వాత జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న సినిమా కావడంతో ఈ సినిమా కోసం పాన్ ఇండియా మూవీ లవర్స్ ఎంతో ఆసక్తి వెయిట్ చేస్తున్నారు. అలాగే ఆచార్య డిజాస్టర్ తర్వాత ఎలాగైనా హిట్టు కొట్టాలనే కసితో డైరెక్టర్ కొరటాల శివ ఈచిత్రాన్ని రూపొందిస్తున్నారు. మొదట్లో ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించాలనుకున్నారు. కానీ ఆ తర్వాత ఈ సినిమాను రెండు భాగాలుగా తీసుకువస్తున్నట్లు ప్రకటించడంతో మూవీ పై మరింత క్యూరియాసిటీ నెలకొంది. మాస్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ మూవీలో తారక్ ఊరమాస్ లుక్‌లో కనిపించనున్నాడు. అలాగే ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ విలన్ పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఇక తారక్ సరసన దివంగత హీరోయిన్ శ్రీదేవి తనయ జాన్వీ కపూర్ నటిస్తుంది. ఈ మూవీతో తెలుగు తెరకు పరిచయం కాబోతుంది జాన్వీ.ఇప్పటివరకు ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్స్, గ్లింప్స్ సినిమాపై మరింత హైప్ పెంచాయి.ఎప్పుడెప్పుడు ఈ మూవీ రిలీజ్ అవుతుందా అని ఎంతో ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు మూవీ లవర్స్. తాజాగా ఈ సినిమా షూటింగ్ గురించి ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ నెట్టింట వైరలవుతుంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతుంది. ఇప్పటివరకు గోవాలో షూటింగ్ కంప్లీట్ చేసుకున్న తారక్.. ఇప్పుడు హైదరాబాద్ తిరిగి వచ్చారు. తాజాగా ఎయిర్ పోర్టులో తారక్ వస్తున్న వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు ఫ్యాన్స్. గోవా షెడ్యూల్ విజయవంతగా పూర్తి చేసి ఎన్టీఆర్ హైదరాబాద్ వచ్చారంటూ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ గా మారింది.

## ఖర్చుల గురించి మాట్లాడుతున్న కృతి సనన్..



ఎంత మార్పూ ఎంత మార్పూ... మేకప్ వేసుకోవడానికి, మనీని స్పెండ్ చేయడానికి మధ్య ఇంత మార్పు ఉంటుందా? ఇంత విలక్షణంగా ఆలోచించే వీలుంటుందా? అని నోరెళ్లబెడుతున్నారు మిమి మాటలు విన్నవారంతా. ఇండస్ట్రీలో ఆర్టిస్టులు ఆమెను చూసి ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని కూడా సలహాలు ఇస్తున్నారు. ఇంతకీ కృతి సనన్ ఏం అన్నారు? జనాలు ఆమె గురించి అంతలా ఎందుకు మాట్లాడుకుంటున్నారు? సినిమాకు పనిచేసే నటీనటులు, టెక్నీషియన్లు ఎంత గొప్పవారైనా సరే ప్రేక్షకులను థియేటర్ల దాకా మాత్రమే తీసుకు రాగలుగుతారు. వచ్చిన వారిని కూర్చోబెట్టాల్సిన బాధ్యత మాత్రం కంటెంట్‌దే అని అంటున్నారు కృతి సనన్. మేకర్స్ ఎక్కువగా దృష్టి పెట్టాల్సింది కంటెంట్ మీదేనని చెబుతున్నారు. సెట్లో నటనటుల మెయింటెనెన్స్ కి ఎక్కువ ఖర్చు అవుతోందన్న విషయం మీద మిస్ మిమి స్పందించారు. సినిమా సెట్‌లో మన వల్ల ఎంత ఖర్చవుతుందన్న విషయం మీద ఓ అవగాహన ఉండాలి. నాకెప్పుడూ ఈ ఆలోచన ఉంటుంది. అనవసరంగా ఖర్చు చేయడానికి నా మనసు ఒప్పదు. సెట్లో జరిగే ప్రతి విషయం మీద అవగాహన పెంచుకున్నప్పుడు వృథా ఖర్చులు ఎవరూ చేయరు. అలా కాకుండా విచ్చలవిడిగా ఉండటం అనేది హాస్యాస్పదం అవుతుంది. బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించిన వారికి గౌరవం ఉండదు అని అన్నారు. నటిగా నేషనల్ అవార్డు కూడా అందుకున్న కృతి సనన్ ఇప్పుడు నిర్మాతగా మారారు. తానే స్వయంగా నటిస్తూ నిర్మిస్తున్నారు. కాజోల్ తో కలిసి నటిస్తున్న దో పత్తి త్వరలోనే నెట్‌ఫ్లిక్స్ లో విడుదల కానుంది. నిర్మాతగా మారిన ఈ టైమ్‌లో కృతి చెప్పిన మాటలు వైరల్ అవుతున్నాయి.

# ఆరోగ్యం

## అన్నం వండడానికి సరైన పద్ధతి ఏదో తెలుసా..?



అన్నంలో కార్బోహైడ్రేట్-రిచ్, గ్లూటెన్-ఫ్రీ, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, విటమిన్లు వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. అన్నం తినడం వల్ల శరీరానికి శక్తి, అవసరమైన అంశాలను అందిస్తుంది. అన్నంలో జీర్ణక్రియకు మేలు చేసే ఫైబర్ కూడా ఉంటుంది. అటువంటి పరిస్థితిలో అన్నాన్ని సరైన పద్ధతిలో వండుకోవటం తప్పని సరి. ఇలా చేస్తే ఇది అన్నం పోషణ, రుచి రెండింటినీ పెంచుతుంది.భారతీయ ఆహారంలో అన్నం అతి ముఖ్యమైన భాగం. చాలా మంది ఉదయం, సాయంత్రం భోజనంలో ఖచ్చితంగా అన్నం తింటారు. అయితే, ఇటీవలి కాలంలో బియ్యంతో వండిన అన్నానికి సంబం ధించి అనేక అపోహలు ఉన్నాయి. అన్నం ఆరోగ్యానికి హానికరం అని కొందరి నమ్మకం. అయితే, ఆయుర్వేదంలో దీని ప్రయోజనాలు అనేకం వివరించబడ్డాయి. కానీ, మీరు అన్నం సరిగ్గా వండినప్పుడు మాత్రమే మీరు అన్నం వల్ల కలిగే ప్రయోజనాలు పొందుతారు. అవును, అన్నం వండడానికి సరైన పద్ధతి ఆయుర్వేదంలో వివరించబడింది. అన్నంలో కార్బోహైడ్రేట్-రిచ్, గ్లూటెన్-ఫ్రీ, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, విటమిన్లు వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. అన్నం తినడం వల్ల శరీరానికి శక్తి, అవసరమైన అంశాలను అందిస్తుంది. అన్నంలో జీర్ణక్రియకు మేలు చేసే ఫైబర్ కూడా ఉంటుంది. అటువంటి పరిస్థితిలో అన్నాన్ని సరైన పద్ధతిలో వండుకోవటం తప్పని సరి. ఇలా చేస్తే ఇది అన్నం పోషణ, రుచి రెండింటినీ పెంచుతుంది. ఆయుర్వేదం ప్రకారం బియ్యాన్ని కాస్త వేయించిన తరువాత అన్నం వాడాలట. దీనిని డ్రై రోస్ట్ అని అంటారు. ఇలా చేయడం వల్ల గింజల ఉపరితలంపై ఉండే వివిధ పిండిపదార్థాలు

## దాల్చిన చెక్కతో ఈ సమస్యలకు చెక్..



ప్రస్తుత యుగంలో అనేక వ్యాధులకు మూలం తినే ఆహార పదార్థాలు. ఇన్స్టెంట్ ఫుడ్‌తో శరీర బరువు పెరిగిపోతుంది. ఇవే అనేక సమస్యలకు కారణం అవుతుంది. దీనిని ఊబకాయం లేదా ఒబెసిటీ అంటారు. ఈ వ్యాధి గ్రస్తులు దాల్చిన చెక్క నీటిని తాగడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో శరీరంలోని కొవ్వును కరిగించే మూలకాలు ఉంటాయి.ప్రస్తుత యుగంలో అనేక వ్యాధులకు మూలం తినే ఆహార పదార్థాలు. ఇన్స్టెంట్ ఫుడ్‌తో శరీర బరువు పెరిగిపోతుంది. ఇవే అనేక సమస్యలకు కారణం అవుతుంది. దీనిని ఊబకాయం లేదా ఒబెసిటీ అంటారు. ఈ వ్యాధి గ్రస్తులు దాల్చిన చెక్క నీటిని తాగడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో శరీరంలోని కొవ్వును కరిగించే మూలకాలు ఉంటాయి. దాల్చిన చెక్క పొడి బయట మార్కెట్లలో దొరుకుతుంది. కల్తీ లేకుండా చూసి తీసుకోవాలి. లేదా ఇంట్లో మిక్సర్ చేసుకోవచ్చు. ప్రతి రోజూ ఒక టేబుల్ స్పూన్ దాల్చిన చెక్క పౌడర్ ను గ్లాసు నీటిలో మరిగించి కషాయంలా సేవిస్తే జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది. దాల్చిన చెక్క ఆకలిని నియంత్రించడమే కాకుండా.. రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్ చేసే హార్మోన్ ఇన్సులిన్‌గా పనిచేస్తుంది. దాల్చినచెక్కను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించవచ్చని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. దీంట్లో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు, యాంటీ ఆక్సిడెంట్లు శరీంలోని మలినాలను బయటకు పంపుతాయి. దాల్చిన నీరు తాగడం వల్ల శరీరం మెటబాలిజం పెరుగుతుంది. దీంతో వెయిట్ లాస్ అయ్యేందుకు చక్కగా పని చేస్తుంది. దాల్చిన చెక్కలో అనేక యాంటీ ఇన్‌ఫ్లమేటరీలు ఉంటాయి. ఆర్థరైటిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధులను చెక్ పెడుతుంది. మెదడు ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది. సాధారణ జలుబు, ఫ్లూ, వార్మ్ ఇన్ఫెక్షన్లు, ఫంగల్ ఇన్ఫెక్షన్లు, ఫుడ్ పాయిజనింగ్ వంటి ఇన్ఫెక్షన్లను మన దగ్గరకు రాకుండా ప్రయోజనం చేకూరుస్తుంది.

## అరటి తొక్కతో అద్భుతమైన ప్రయోజనాలు..



చర్మ సమస్యల నుండి బయటపడటానికి ప్రజలు ఖరీదైన సౌందర్య సాధనాలను, సౌందర్యం కోసం రకరకాల చికిత్సలను ఆశ్రయిస్తారు. ఇది చాలా డబ్బు ఖర్చు చేయడమే కాకుండా మీ చర్మంపై దుష్ప్రభావాల భయాన్ని కలిగి ఉంటుంది. అదే సమయంలో సహజ వస్తువులు చౌకగా ఉంటాయి. ఎటువంటి హాని కలిగించవు. అరటిపండు మీ ఆరోగ్యానికి, చర్మానికి..చర్మ సమస్యల నుండి బయటపడటానికి ప్రజలు ఖరీదైన సౌందర్య సాధనాలను, సౌందర్యం కోసం రకరకాల చికిత్సలను ఆశ్రయిస్తారు. ఇది చాలా డబ్బు ఖర్చు చేయడమే కాకుండా మీ చర్మంపై దుష్ప్రభావాల భయాన్ని కలిగి ఉంటుంది. అదే సమయంలో సహజ వస్తువులు చౌకగా ఉంటాయి. ఎటువంటి హాని కలిగించవు. అరటిపండు మీ ఆరోగ్యానికి, చర్మానికి మాత్రమే కాదు, దాని పై తొక్క మీ చర్మానికి కూడా చాలా మేలు చేస్తుంది. చాలా మంది ప్రజలు అరటి తొక్కను విసిరివేస్తారు, అయితే పండిన అరటి తొక్క మీకు అనేక చర్మ సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది మరియు చర్మాన్ని ఆరోగ్యంగా మార్చడంలో సహాయపడుతుంది. కాబట్టి దానిని ఉపయోగించడానికి సరైన మార్గం ఏమిటో మాకు తెలియజేయండి. అరటి తొక్కలో ఫైబర్, ఐరన్, కాల్షియం, విటమిన్ 12, జింక్, మెగ్నీషియం, అనేక ఇతర యాంటీఆక్సిడెంట్లు కూడా ఉన్నాయి. ఇవి చర్మాన్ని మెరిసేలా చేయడంలో సహాయపడతాయి. మీరు అరటి తొక్క లోపలి భాగంతో మీ చర్మాన్ని మసాజ్ చేయవచ్చు. ఇది లోతైన శుభ్రపరిచే పనిని చేయడమే కాకుండా చర్మాన్ని మృదువుగా చేస్తుంది.అరటి తొక్క లోపలి భాగంలో తేనెను అప్లై చేయడం ద్వారా మీ ముఖానికి మసాజ్ చేయవచ్చు.

# క్రీడలు

## రంజీ ట్రోఫీ మ్యాచ్ ఆడినట్లుంది.. నాపై ఒత్తిడేం లేదు: శివమ్ దూబె



శివమ్ దూబె యూఎస్ఏతో జరిగిన మ్యాచ్‌లో ఓపెనర్లతోపాటు దూకుడుగా ఆడే రిషభ్ పంత్ వికెట్‌ను కోల్పోయి కష్టాల్లో పడిన భారత జట్టును ఆదుకున్నాడు. సూర్యకుమార్ యాదవ్‌కు (50లి) మద్దతుగా నిలిచిన దూబె (31లి) విలువైన పరుగులను సాధించాడు. టీ20 వరల్డ్ కప్‌లో మొదటి రెండు మ్యాచుల్లో అతడు విఫలమైన సంగతి తెలిసిందే. ఈసారి కూడా సరైన ప్రదర్శన చేయకపోతే తుది జట్టులో అవకాశం చేజారేదే. యూఎస్‌ఏపై మాత్రం అద్భుతంగా ఆడాడు. తన ఆటతీరుపై దూబె ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "టోర్నీ ఆరంభంలో నా ఫామ్‌పై ఇబ్బంది పడ్డా. ఎలా బయటపడాలనే దానిపై దృష్టిసారించా. అందుకోసం తీవ్రంగా శ్రమించా. అదే సమయంలో నాపై ఎలాంటి ఒత్తిడి లేదు. కోచ్‌లు, సహాయక సిబ్బంది మద్దతుగా నిలిచారు. 'ఇలాంటి పిచ్‌పై ఆడటం చాలా కష్టం. అయినా సిక్స్‌లు కొట్టగలిగే సత్తా నీకుంది. దానిని అనుసరించా' అని ఉద్బోధ చేశారు. నా ఆటతీరుపై నాకెలాంటి అనుమానాలు లేవు. సీఎస్కే తరఫున ఐపీఎల్‌లో దూకుడుగా ఆడినప్పటికీ.. ఇప్పటి పిచ్ పరిస్థితుల్లో చాలా మార్పులు ఉన్నాయి. అందుకోసం ఇలాంటి పిచ్‌లపై విభిన్నమైన విధానం అనుసరించా. యూఎస్‌ఏపై విభిన్నంగా ఆడేందుకు ప్రయత్నించా. ఇప్పుడు ఈ టోర్నీలో నేను ఆడుతుంటే.. నాకు రంజీ ట్రోఫీ మ్యాచ్ గుర్తుకొచ్చింది. ఇది తెల్లబంతి పోరుగా అనిపించలేదు. మరీ ముఖ్యంగా సిక్స్ కోసం వేచి చూడాల్సిన పరిస్థితి. మనం ఎలా ఆడాలనేది పిచ్ కండీషన్ నిర్దేశిస్తోంది. అత్యుత్తమ షాట్‌ను ఎంపిక చేసుకుంటేనే సిక్స్ కొట్టగలుగుతాం. ఏమాత్రం మిస్ అయినా వికెట్ నష్టపోవడమే. అందుకోసమే నేను చాలాసేపు వేచి చూశా. తొలి బంతి నుంచే హిట్టింగ్ చేయాలనుకోవడం సరికాదు. ఇక్కడ అస్సలు అలాంటి పరిస్థితే ఉండదు. కాస్త సమయం తీసుకోవాల్సిందే. చెత్త బంతి పడే వరకు వేచి చూడాలి. ఇప్పటి వరకు వరల్డ్ కప్‌లో ప్రతి క్షణాన్ని ఆస్వాదించా. నేను విఫలమైనప్పుడూ వాటి నుంచి పాఠాలు నేర్చుకొనేందుకు ప్రయత్నించా. అందుకే, ఇక్కడ ఏ జ్ఞాపకాన్ని చెరిపేయాలనుకోను. ఇక బౌలింగ్ కూడా వేసేందుకు సిద్ధమవుతున్నా. ఈసారి ఒక ఓవర్ మాత్రమే వేసే అవకాశం వచ్చింది. ప్రత్యర్థి బ్యాటర్ సిక్స్ కొట్టడంతో మరో ఓవర్ రాలేదు. భవిష్యత్తులో మరిన్ని ఓవర్లు వేసేందుకు ప్రయత్నిస్తా" అని దూబె వెల్లడించాడు.

## విరాట్.. కాస్త ఓర్పు ప్రదర్శించు చాలు: గావస్కర్



పదిహేను రోజుల కిందట ముగిసిన ఐపీఎల్ 2024 సీజన్ టాప్ స్కోరర్ విరాట్ కోహ్లీ.. ఈ భారత స్టార్ టీ20 ప్రపంచ కప్ టోర్నీకి వచ్చేసరికి తేలిపోవడం అభిమానులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఇప్పటి వరకు కోహ్లీ ఆడిన మూడు మ్యాచుల్లో సింగిల్ డిజిట్‌కే పరిమితమైన సంగతి తెలిసిందే. దీంతో అతడి ఫామ్‌పై మళ్లీ ఆందోళన నెలకొంది. యూఎస్‌ఏ పిచ్‌లపై నెమ్మదిగా ఆచితూచి ఆడాల్సిన సమయంలో ఒత్తిడికి గురై వికెట్‌ను సమర్పిస్తున్నాడని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. తాజాగా యూఎస్‌ఏపై తొలి బంతికే వికెట్‌ను సమర్పించాడు. ఓపెనర్‌గా రావడం కూడా అతడి ఆటతీరుపై ప్రభావం చూపి ఉంటుందని పలువురు అభిప్రాయపడ్డారు. అయితే, విరాట్ ఫామ్‌పై ఎలాంటి ఆందోళన అక్కర్లేదని.. మున్ముందు మ్యాచుల్లో కీలకమవుతాడని భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ వ్యాఖ్యానించాడు. "వరుసగా మ్యాచ్‌లను గెలవడమే ఏ ఆటగాడికైనా స్ఫూర్తి. దేశం కోసం ఆడేటప్పుడు గర్వపడుతూ ఆడాలి. విరాట్ కోహ్లీ భారత్ కోసం ఎన్నో విజయాలను అందించాడు. తప్పకుండా అతడికి గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు మనం టోర్నీ తొలి దశలోనే ఉన్నాం. ఇంకా సూపర్ - 8, సెమీస్, ఫైనల్ ఉన్నాయి. కోహ్లీ కాస్త ఓర్పు పాటిస్తే మాత్రం తప్పకుండా మంచి ఇన్నింగ్స్‌లు ఆడతాడు. ఇంకా అతడిలో చాలా క్రికెట్ మిగిలే ఉంది. వరుసగా మూడు మ్యాచుల్లో తక్కువ స్కోరుకే పరిమితమైనంత మాత్రాన.. ఒక బ్యాటర్ సరిగా ఆడలేదని కాదు. కొన్నిసార్లు బౌలర్లు ఆధిపత్యం ప్రదర్శిస్తారు. మంచి బంతులను ఎదుర్కొనే క్రమంలో బ్యాటర్లు పెవిలియన్‌కు చేరుతుంటారు. కాబట్టి, దీని గురించి పెద్దగా ఆందోళన చెందక్కర్లేదు. అతడిపై మనకు నమ్మకం ఉంది. ఇలాంటి పరిస్థితుల నుంచి ఎలా బయటకు రావాలనేది కోహ్లీకి బాగా తెలుసు" అని గావస్కర్ వ్యాఖ్యానించాడు. గ్రూప్ స్టేజ్‌లో భారత్ చివరి మ్యాచ్‌ను కెనడాతో జూన్ 15న ఆడనుంది. అది ఫ్లోరిడా వేదికగా జరగనుంది. న్యూయార్క్ పిచ్ బౌలర్లకు సహకరించింది. మరి ఫ్లోరిడా మైదానం ఎలా ఉంటుందో తెలియాలంటే వేచి చూడాల్సిందే. ఇక్కడ వర్షాలు పడుతున్నాయి. ఇప్పటికే ఒక మ్యాచ్ (శ్రీలంక-నేపాల్) రద్దైన సంగతి తెలిసిందే.

## అమెరికాపై భారత్ విజయం..

టీ20 ప్రపంచకప్‌లో భాగంగా అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో నెగ్గి సూపర్-8కి దూసుకెళ్లింది. తొలుత బ్యాటింగ్ చేసిన అమెరికా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 110 పరుగులు చేసింది.



## కేంద్ర సహాయమంత్రిగా బాధ్యతలు చేపట్టిన పెమ్మసాని



అమరావతీ, సూర్యవాస్తవం: గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల సహాయమంత్రిగా పెమ్మసాని నియామకం చెందిన విషయం తెలిసిందే. కాగా నేడు ఆయన కేంద్ర సహాయాంత్రిగా భాద్యతలు స్వీకరించారు. ఈ సంధర్భంగా ప్రధాని మోదీకి, సీఎం చంద్రబాబుకు పెమ్మసాని కృతజ్ఞతలు తెలిపారు.అంచనాలకు తగ్గని రీతిలో పనిచేస్తానని వెల్లడి చేశారు.

## రైతాంగానికి సాగునీరు అందించే కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్



తూర్పుగోదావరి జూన్ 13 (సూర్య వాస్తవం) : సమాజానికి అన్నం పెట్టే రైతుకు సాగునీరు అందించే కార్యక్రమంలో మంత్రి హెూదాలో తొలిసారిగా పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. గురువారం నిడదవోలు మండలం సీతంపేటలో " పెండ్యాల పంపింగ్ స్కీం " ఎత్తిపోతల పథకం ద్వారా ఆయకట్టు రైతాంగానికి సాగునీరు అందించే కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి పాల్గొని సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా నియోజకవర్గానికి విచ్చేసి మొట్టమొదటిగా రైతులకు సాగునీటిని అందించే కార్యక్రమంలో పాల్గొనటం నా అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ ప్రభుత్వం హయంలో ప్రతి చేనుకు నీరు.. ప్రతి ఒక్కరికీ పని అనే నినాదంతో ముందుకు వెళతామని రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మంత్రి వర్యులు కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. సుదీర్ఘ అనుభవం ఉన్న నారా చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని, ఆశయ సాధనకు కట్టుబడి ఉండాలనే ధృఢ సంకల్పం కలిగిన పవన్ కళ్యాణ్ పై అచంచలమైన విశ్వాసంతో దేశ ప్రధాని నరేంద్ర మోడీ మద్దతు కలిగిన కూటమిని ప్రజలు అధికారంలోకి తీసుకుని రావడం జరిగిందన్నారు. ప్రజలు చూపెట్టిన ఆకాంక్షల మేరకు ఈ ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. జల వనరుల పథకాలు ఏర్పాటు చెయ్యడం కాకుండా వాటి నిర్వహణ కొరకు తగిన జాగ్రత్తలు తీసుకొని వెళ్ళడం అత్యంత కీలకం అని స్పష్టం చేశారు.




IRS PUBLICATIONS, 13-2-819-2, RAMBO RESIDENCE, RTC BUS STAND ROAD, SRINIVAS NAGAR, ANANTAPUR ANANTAPUR, ANDHRA PRADESH, 515001 GSTIN: 37AAJFI5233N1ZY TEL:7672042522 - EDITOR : M. IRSHADBEG - CELL - 918500425222.